Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
*Longest Living Newspaper in Telugu Journalism*

షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
- ఇంప్లాంటేషన్.
- ఎత్తుపళ్ళు, వంకరపళ్ళు సరిచేసే చికిత్స.
- రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్.
డా॥ SK. మహమ్మద్ అలి
కన్సల్టెంట్ డెంటల్ సర్జన్
నెల్లూరు - 524 001.
ఫోన్ : 0861 - 2340032

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 35 • 14-8-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరియు రిటైర్డ్ ఉద్యోగుల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులు తిరిగి పొందే (రీయింబర్స్‌మెంట్) సదుపాయం కలదు.
డా॥ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, MDS.
Asst. Professor Endodontics
పొగతోట, నెల్లూరు - ఫోన్ : 2303300

# ఇంట్లో దాక్కొన్న ఇసుక దొంగలు




పెన్నానది ఇసుక అక్రమ వ్యాపారం జిల్లా రాజకీయాలలో పెను తుఫాను సృష్టిస్తున్నది. సంచలనాలకు దారి తీస్తున్నది. పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలించడంపై జిల్లా పరిషత్ ఛైర్మన్ కన్నెర్ర చేయడం తెలిసిన సంగతే. దాదాపు మూడునెలలుగా నిరాటంకంగా జరిగిపోతున్న అక్రమ వ్యాపారం ఇది. పత్రికలలో ఎన్నిసార్లు వార్తలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. ఒకరిద్దరు అధికారులు సాహసించి చర్య తీసుకోవడానికి ముందుకు వచ్చినా ఇసుక మాఫియా రాజకీయ ప్రాబల్యం ముందు వారి శక్తి చాలలేదు. గుంటూరు నుంచి వచ్చిన ఒక విజిలెన్స్ అధికారికి పొట్టేపాళెం దగ్గర దేహశుద్ధి చేసి పంపారు ఈ దుర్మార్గులు. వారి మీద ఫిర్యాదు తీసుకోవడానికి టకూడా ఎస్పీతో సహా జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం భయంతో వణికిపోయింది. దానితో ఇక దారికి అడ్డం లేదని భావించి, ఒకటికి ఎనిమిది రేవుల నుంచి ఇసుక త్రవ్వి, మద్రాసుకు రవాణా చేస్తుండినారు. పెద్ద యంత్రాలు పెట్టి, పెన్నానది గర్భంలో కందకాలు త్రవ్వి, లక్షలాది టన్నుల ఇసుకను తరలించి వేశారు. ఈ దశలో జిప ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి జోక్యం చేసుకొని, మైనింగ్ అధికారులను పిలిపించి తలవాచేట్లు చీవాట్లు పెట్టడం, దానికి పత్రికలలో విస్తృత ప్రచారం రావడంతో ఒక్కసారిగా అక్రమ వ్యాపారం బంద్ అయిపోయింది. జిప ఛైర్మన్ అండ వుందన్న ధైర్యంతో మైనింగ్ అధికారులు అన్ని రేవుల మీదా దాడి జరిపారు. ఆ పరిస్థితి వస్తుందని ముందుగానే అర్థం చేసుకొన్న ఇసుక మాఫియా మూక, అన్నిరేవుల నుంచి యంత్రాలు, లారీలు రాత్రికి రాత్రే తరలించి వేశాయి.

ఈ నిలువు దోపిడీపై, 9తేది జరగవల్సిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చ జరపాలని ప్రతిపాదించాడు ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చాలా తెలివైన రాజకీయ ఎత్తుగడ ఇది. ఎలుకను బోనులోకి లాగే ప్రయత్నంతో న వ గా న ం. ఇసుక దొంగలు ఆనం సోదరులన్న సంగతి అందరికీ తెలుసు. కానీ ఎవరూ ఆ మాట నేరుగా అనలేని పరిస్థితి. వారి అధికార ప్రభావం అంత ప్రబలంగా వుంది కదా? దీనిపై జిప సమావేశంలో చర్చపెడితే, తెలుగుదేశం వంటి ప్రతిపక్షాలు ఖచ్చితంగా నిలదీస్తాయి. జిల్లా మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దానితో బండారం బయట పడిపోతుంది.

ఈ ఎత్తుగడ అటు మంత్రి రామనారాయణరెడ్డిని, ఇటు ఎమ్మెల్యే వివేకానందరెడ్డిని కూడా చిత్తు చేసింది. సమావేశానికి హాజరైతే తమను ప్రతిపక్షాలు ఇసుక దొంగలని గేలి చేస్తారన్న భయంతో

కొరవ 14వ పేజీలో

## ఆదాయం రోజుకు 17 లక్షలు

తమ సోదరుల చేత అధికారుల కళ్ళు మూయించినందుకు ఆనం విజయకుమార్‌రెడ్డికి సిండికేటులో 25శాతం వాటా ఉచితంగా ఇచ్చారట. ఆ వాటాకు గాను ఆయనకు రోజుకు 13లక్షల సగటున లాభం వచ్చింది. ఆనం రామనారాయణరెడ్డికి రోజుకు మూడు లక్షలు, వివేకానందరెడ్డికి రోజుకు లక్ష లెక్కన రౌడీ మామూళ్లు చెల్లించారు. అంటే మొత్తం మీద ఆనంవారి ఇంటికి రోజుకు 17లక్షల రూపాయల రాబడి వచ్చి పడిందన్నమాట. దాదాపు 80 రోజులు ఈ అక్రమ వ్యాపారం నడిచింది. ఇసుక దోపిడీతో వారికి ముట్టిన సొమ్ము 13కోట్ల పైమాటే అన్న మాట. ఏ వ్యాపారం చేస్తే ఇంత లాభం వస్తుంది చెప్పండి.

## దంత వైద్యం ఇక బాధించదు!

\- డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

దంత సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఇప్పుడు చక్కని చికిత్స అందుబాటులోకి వచ్చింది నెల్లూరు బృందావనంలోని డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి దంత వైద్యశాలలో. అదే లేజర్ చికిత్స. ఎలాంటి ఇంజక్షన్‌లు, మందులు వాడనవసరం లేకపోవడం లేజర్ దంతవైద్య చికిత్స ప్రత్యేకత. నోటి దుర్వాసన, చిగుళ్ల నుండి రక్తం కారడం, చీము పట్టడం, పళ్ల మధ్య ఏర్పడే సందులు, వాటి కారణంగా దంతాలు కదలడం లాంటివి అధికశాతం మంది ఎదుర్కొనే దంత సమస్యలు. ఈ జబ్బులను పయోరియా అంటారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు, గుండెజబ్బులతో బాధపడేవారికి, 40 సంవత్సరాల వయసు పైబడిన వారిలో ఈ దంతవ్యాధి లక్షణాలు అధికంగా కన్పిస్తుంటాయి. దీనికి సాధారణంగా చేసే చికిత్సను ఫ్లాప్ సర్జరీ అంటారు. ఈ సర్జరీలో ఇంజక్షన్ చేసి చిగుళ్లలో, ఎముకల్లోని చెడిపోయిన భాగాన్ని క్లీన్ చేసి ఆ తర్వాత కుట్లు వేయడం జరుగుతుంది. ఈ విధానంలో చికిత్స కొంత బాధ, నొప్పితో కూడుకొని వుండడంతోపాటు మందులను వాడవలసి వుంటుంది. దీనికి భిన్నంగా ఎలాంటి నొప్పి లేకుండా, మందులను వాడాల్సిన అవసరం లేకుండా చేసే అత్యాధునిక చికిత్సా విధానమే లేజర్ చికిత్స.



లేజర్ చికిత్సలో మొదటగా రోగికి డిజిటల్ ఎక్స్‌రే సహాయంతో నోటిలోని సూక్ష్మమైన రుగ్మతలను గుర్తించి, ఆయా భాగాల్లోకి లేజర్ కిరణాలను ప్రసరింపచేస్తారు. ఈ లేజర్ కిరణాలను ప్రసరింపజేయడం వలన క్షణాలలో జబ్బు నయమవుతుంది. సురక్షితమైన ఈ పద్ధతిలో ఎలాంటి మందులు, ఇంజక్షన్‌ల అవసరం వుండదు.

జిల్లాలో మొట్టమొదటిసారిగా 17 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ స్కానింగ్, లేజర్‌ను తమ వైద్యశాలలో ఏర్పాటుచేశామని, దీని వలన అత్యాధునిక లేజర్ చికిత్స సామాన్యులకు అందుబాటులోకి తేవడం తమ ఉద్దేశమని, ఈ లేజర్ చికిత్సా విధానంపై ఏమైనా సందేహాలుంటే తమ వైద్యశాలకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చుంటున్నారు దంత వైద్యనిపుణుడు డాక్టర్ యం.శ్రీధర్‌రెడ్డి.

డాక్టర్ యం.శ్రీధర్‌రెడ్డి, MDS
డా॥ హరిశ్చంద్రారెడ్డి దంత వైద్యశాల
బృందావనం, నెల్లూరు.
✆ 0861 - 2328060

# భయమే ప్రమాదం

స్వైన్‌ఫ్లూ జ్వరం దేశ ప్రజానీకాన్ని వణికిస్తున్నది. జనం ప్రాణభయంతో అల్లాడిపోయే పరిస్థితి కల్పిస్తున్నది. మెక్సికో దేశంలోని ఒక పందుల కేంద్రం నుంచి ఈ వైరస్ ఉత్పత్తి అయ్యిందని చెప్తారు. గత ఏప్రెల్ నెలలో మొదటిసారిగా ఆ దేశంలోనే ఇది బయటపడింది. అప్పటినుంచి ఒక మహమ్మారి వలె ప్రపంచమంతటా వ్యాపిస్తున్నది. ఆరోగ్యం విషయంలో అతి జాగ్రత్తలు పాటించే అమెరికా వంటి అగ్రరాజ్యాలు ఈ వైరస్ ధాటికి విలవిల లాడిపోయాయి. మనదేశం కూడా ఆనాటి నుంచే జాగ్రత్తలు పాటిస్తూ వస్తున్నది. ఒక్క హైదరాబాద్ విమానాశ్రయంలోనే మే నెల నుంచి ఇప్పటి వరకు 2 లక్షలా 80వేల మంది ప్రయాణీకులకు స్వైన్‌ఫ్లూ జ్వర పరీక్షలు జరిపారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో ప్రభుత్వ ఆస్పత్రులలో ఇందుకోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. దేశం వెలుపల నుంచి వచ్చే ప్రయాణీకులను శల్య పరీక్ష చేసి కానీ, దేశంలో అడుగు పెట్టడానికి అనుమతించడం లేదు. అన్ని జాగ్రత్తలు తీసుకొన్నా, మన దేశంలోనూ ఆ మహమ్మారి విలయతాండవాన్ని నిలువరించలేక పోయారు. ఇప్పటివరకు దేశం మొత్తం మీద దాదాపు వెయ్యి మంది ఈ రోగం బారినపడ్డారని అంచనా. ఇందులో పన్నెండు మంది ప్రాణాలు కోల్పోయారు. పూనా నగరంలో ఈ జ్వర పీడితులు అధికంగా వుండడంతో మహారాష్ట్ర ప్రభుత్వం గందరగోళంలో పడిపోతున్నది. నగరం మొత్తంలో అత్యవసర పరిస్థితి విధించిన వాతావరణం కన్పిస్తుందిప్పుడు. బడులు, సినిమాహాళ్లు, షాపింగ్‌మాళ్లు వంటివన్నీ మూసివేశారు. దగ్గు వచ్చినా, తుమ్ము వచ్చినా జనం భయంతో వణికిపోతూ, ఆస్పత్రుల ముందు క్యూలు కడుతున్నారు. మూతికి మాస్క్ కట్టుకోకుండా ఎవరూ బయటకు రావడం లేదు. రైళ్లు, బస్సులు ఖాళీ అయిపోయాయి. రోడ్లన్నీ నిర్మానుష్యమైనాయి. ఇరవైఏళ్ల క్రితం సూరత్ నగరంలో ప్రబలిన ప్లేగు వ్యాధి వుధృతి తర్వాత దేశ ప్రజలను ఇంతగా భయపెట్టిన సంఘటన మరేదీ లేదు.

నిజానికి ఇది నయం కాని వ్యాధి కాదు. అంతగా భయపడవల్సిన అవసరమూ లేదు. ప్రాథమిక దశలో చికిత్స తీసుకొంటే మామూలు జ్వరం వలె తగ్గిపోతుంది. అందుకు మందులూ వున్నాయి. దీనితో వచ్చే ప్రమాదం – ఒకరినుంచి మరొకరికి అత్యంత వేగంగా వ్యాప్తి చెందడం మాత్రమే. చాలారకాల వైరస్ జ్వరాలకు ఆ లక్షణం వుంది. మన దేశంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, కలరా, డయేరియా వంటి వ్యాధులు ఎన్నో వున్నాయి. ప్రతి ఏటా కొన్ని లక్షల మంది వీటి బారినపడి ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోని ఏజన్సీ గ్రామాలలో ప్రతి వర్షాకాలంలో కొన్ని వేల మంది విష జ్వరాల వాతన పడి మరణిస్తున్నారు. వాటి వేటినీ లెక్కచేయని ప్రభుత్వాలు, పత్రికలు స్వైన్‌ఫ్లూ విషయంలో మాత్రం ఇంత ఆగం ఎందుకు చేస్తున్నాయో బోధపడడం లేదు.

జాగ్రత్తలు తీసుకోవడానికి, భయపడడానికి చాలా తేడా వుంది. స్వైన్‌ఫ్లూ విషజ్వరం సోకిన వారిని వెంటనే ఆస్పత్రులలో చేర్పించడం, ఆ రోగ లక్షణాలు కనిపించిన వెంటనే నిర్ధారణ పరీక్ష జరిపించడం, అది సోకిన వారు జనంతో కలవకుండా చూడడం వంటి జాగ్రత్తలు తీసుకొంటే ఇదేమీ భయపడవలసినంత ప్రమాదకారి కాదు. అసలు జ్వరం కంటే, దానిభయం వల్లనే ప్రజలకు ఎక్కువ నష్టం జరుగుతున్నది. ప్రజలను ప్రాణభయంతో చంపడానికి బదలు, దానిపట్ల ప్రజలలో అవగాహన కల్పించడం మీద ప్రభుత్వాలు తమ దృష్టిని, శక్తిని కేంద్రీకరించాలని మనవి.

## జనవాణి

### ఇసుక దోపిడీ అన్యాయం

ఇసుక స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన అధికార పార్టీ నాయకులు, అధికారులు స్మగ్లర్లకు అండదండలందించడం కన్నా సిగ్గుచేటైన విషయం మరొకటి లేదు. జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ మూలంగా ఈ వ్యవహారం బయటపడింది. లేకుంటే ఆనం సోదరులు ఈ విషయాన్ని పెన్నానదిలో గోతితీసి కప్పిపెట్టేవారు. జిల్లా మంత్రుల అడుగులకు మడుగులొత్తి ప్రభుత్వ ఖజానాకు 30కోట్లు దిల్లావడేలా చేసిన జిల్లా అధికారులను సైతం ఇసుక రీచ్‌ల కుంభకోణం వ్యవహారంలో ప్రాసిక్యూట్ చేయాలి.

పి.సుదర్శన్, నెల్లూరు

### ప్రజాసమస్యలపై చర్చించండి!

శాసనసభ సమావేశాలు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ప్రారంభమైనాయి. ప్రధాన ప్రతిపక్షం, పాలక పక్షం క్రమపద్ధతిలో ప్రజా సమస్యలపై సంయమనంతో చర్చించాల్సిందిపోయి ఎప్పటి మాదిరిగానే వ్యక్తిగత ఆరోపణలతో సభా కాలాన్ని వృధా చేస్తున్నాయి. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించిన పాపాన పోలేదు. ఇలా అయితే ఎలా?

దోగిపర్తి సత్యం, అల్లూరు

### విద్యుత్ కోత తీవ్రం

గ్రామాల్లోనూ ప్రజలు జీవిస్తున్నారన్న స్పృహ ట్రాన్స్‌కో అధికారులకు లేనట్లుంది. వేళాపాళా లేకుండా ఇక్కడ విద్యుత్ కోత విధిస్తున్నారు. వేకువజామున 4.30 గంటలకు విద్యుత్ తీస్తున్నారు. మళ్లీ ఎప్పుడిస్తారో తెలియదు. మిట్ట మధ్యాహ్నం ఒంటిగంటకు తీసేస్తారు. సాయంత్రం ఐదు గంటలకు ఇస్తారు. చీకటిబడ్డాక ఎన్నిసార్లు కోత విధిస్తారో తెలియదు. విద్యుత్‌కోత మూలంగా గ్రామాల్లో చీకటి రాజ్యమేలుతుంది. కోతవేళలను ముందుగా ప్రకటించి విధించాలన్న జ్ఞానం ఆ శాఖాధికారులకు లేకపోవడం బాధాకరం.

కె.సువర్చల, కడనూతల

### తిరుమలకు వెళ్తే ఎన్ని కష్టాలు!

దేవదేవుని దర్శించను తిరుమల వెళ్లిన భక్తులు నానాపాట్లు

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

18-8-1939
పేజీలు : 20 వెల: అణా

### నెల్లూరుజిల్లా బోర్డు ఎలక్షన్

ఎలక్షన్ ఎప్పుడో? గవర్నమెంటు ప్రకటన ఇంకా రాలేదు. ఇక్కడ విచారిస్తే ఇంకా ఓటర్సులిస్టే సమగ్రంగా తయారు కాలేదట.

కాంగ్రెసు వర్కింగ్ కమిటీవారు 11వ తేది నుండి 16వ తేది మధ్యాహ్నం దాకా కూర్చొని ఏడు సర్కిళ్లు తప్ప తక్కినవన్నీ పరిష్కరించారు. అభ్యర్థులను సెలక్టు చేసిన జిల్లా కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యుల పేర్లు బద్దెపూడి వెంకట నారాయణరెడ్డి గారు, తిక్కవరపు రామరెడ్డిగారు, కె.ఎల్.నారాయణరావు గారు, వెన్నెలకంటి రాఘవయ్య గారు, బత్తిన పెరుమాళ్లు నాయుడు గారు, పుచ్చలపల్లి సుందరయ్య గారు, దువ్వూరు బలరామిరెడ్డి గారు, మన్నేపల్లి హనుమంతరావు గారు, బత్తెన రామకృష్ణారెడ్డి గారు, రావిపాటి మహానంద చౌదరి గారు, గూడూరు వీరరాఘవులు నాయుడు గారు, తాటికొండ వెంకటసుబ్బయ్య గారు, బట్టేపాటి రామరెడ్డి గారు, వేణుంబాక శంకరరెడ్డి గారు, కైపు వీరారెడ్డి గారు.

### అబ్బా ఎన్నాళ్లకు...

వెంకటగిరి ఎస్టేటు వారికి జిల్లా బోర్డు ఎలక్షన్‌లో ఏమాత్రం జోక్యం లేదని ఎస్టేటు వారు ప్రకటిస్తూ అన్ని తాలూకాలకు తెలిపారట. ఎన్నాళ్లకు మా ఎస్టేటు వారికి వివేకోదయమైందబ్బా!!

–చిత్రగుప్తుడు

### పల్లెటూళ్ల ఇబ్బందులు

నెల్లూరుజిల్లా కాంగ్రెసు సంఘం, జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీల యాజమాన్యాన జాతీయ వాంఛా ప్రచారం చేయడానికి బయలుదేరిన ఎస్.శంకరయ్య, డి.అంకయ్య, వై.దశరథరామయ్య, బి.శంకరయ్య గారలు తమ రిపోర్టులో పల్లెటూళ్ల ఇబ్బందుల గూర్చి ఈ క్రింది విషయాలు తెల్పిరి.

రేగడ చెలిక : ఈ గ్రామానికి 50 గజాలలో రిజర్వు వుండబట్టి పశువులకు గొర్రెలకు ఇబ్బందిగా వున్నది.

మర్రిపాడు : సుమారు 1500 మంది యుండు గ్రామమైనప్పటికిన్నీ స్కూలు లేదు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

14 - 8 - 1959
పేజీలు: 12 వెల: 0-3-0

### ఢిల్లీకి పోతున్న గోపాలరెడ్డి

కోయంబత్తూరు సమీపంలోని వరంగలియార్ ఏనుగుల క్యాంపు నుంచి 4 1/2 సంవత్సరాల వయస్సు గల ఏనుగ గున్న 'గోపాలరెడ్డి' భారత రాజధానికి ప్రయాణం కడుతున్నారు.

ఈ ఏనుగను మద్రాసు ప్రభుత్వం ఢిల్లీకి బహూకరించింది. గత సంవత్సరం జనవరిలో కేంద్ర రెవిన్యూ పౌర వ్యవసాయశాఖామాత్యులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు ఈ ఏనుగుల క్యాంపును దర్శించినప్పుడు, ఈ గజరాజుకు గోపాలరెడ్డి అని నామకరణం జేశారు. అది కడకు గోపాలరెడ్డి గారున్న చోటుకే చేరుతున్నది.

### నెల్లూరు ముచ్చట్లు

### నాట్లు నిల్చిపొయ్యాయి

సరిగా నాట్లు సమయం వచ్చేసరికి, ఏట్లో నీళ్లు లేకుండా పోయినవి. నార్లు ఎదిగి నష్టం గావడమేగాక, నారువేతలు వెనుకబడేటట్టున్నది. వున్న నీటితో వేసిన పైర్లు గూడా ఎండిపోయే ప్రమాద ముండవచ్చును. వర్షాలు లేవు. ఏరు వస్తుందనే ఆశ కనుపించడం లేదు. కె.సి.కెనాలు నీళ్లయినా పెన్నకు దింపి నెల్లూరు తాలూకా రైతులకు తక్షణం సహాయపడడం అవసరం. కోదండరామిరెడ్డి, సుబ్బారెడ్డి గారలు కె.సి.కెనాలు నీటికి హైదరాబాదులో ప్రయత్నించవలసిందిగా కోరుతున్నాము.

### మునిసిపల్ ఎన్నికలు

నెల్లూరు, గూడూరు మునిసిపల్ ఎన్నికల కార్యక్రమం ప్రకటితమైనది.

నామినేషన్లు

సెప్టెంబరు 2, 3, 4 తేదులు

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉపసంహరణలు | - | 7-9-59 | పోలింగ్ | - | 28-9-59 |
| ఓట్ల లెక్కింపు | - | 29-9-59 | | | |

–విమర్శకుడు

# నెల్లూరు ముచ్చట్లు

## విశేషములు

### కెజి బేసిన్ గ్యాస్‌పై మాట్లాడిన జనార్ధన్‌రెడ్డి!

రాష్ట్రంలో వివరీతంగా చర్చ జరుగుతున్న కెజి బేసిన్‌లో గ్యాస్‌కు సంబంధించిన మన రాష్ట్ర హక్కులపై రాజ్యసభలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గళమెత్తారు. గ్యాస్ కేటాయింపుపై కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రిని వివరణ అడిగారు. ఈ అంశంపై జనార్ధన్‌రెడ్డికి, జిల్లాకు చెందిన మరో ఎమ్పీ వెంకయ్య నాయుడు మద్దతుగా నిలిచారు. బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను రాష్ట్ర ప్రజలు కూడా వాడుకొనేలా ఉత్తర్వులి స్తామని ఆ శాఖామంత్రి మురళీదేవరా, జనార్ధన్ రెడ్డికి హామీ ఇచ్చారు.

### నిమ్మకాయలకు యమ గిరాకి!

గతంలో ఎప్పుడూ లేనంతగా నిమ్మ కాయలకు గిరాకీ ఏర్పడింది. బస్తా కాయలు ఐదువేలరూపాయల ధర పలు కుతున్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గట్టు నిమ్మకాయలు గూడూరు, పొదలకూరు మార్కెట్‌లకు రావడం లేదు. దేశవ్యా ప్తంగా నిమ్మపంట దెబ్బతినడంతో బస్తా ఈ రేటు పలుకుతున్నది.

### ముగ్గురు మహిళలపై వేధింపులు

నెల్లూరు నగరంలోని వేరు వేరు ప్రాంతాల్లోని ముగ్గురు మహిళలు 12వ తేది వేధింపులకు గురయ్యారు. బాధి తులు ముగ్గురు తమకు న్యాయం చేయ మని నగర డిఎస్పీ రాధికారెడ్డి ఇంటికి వెళ్లడంతో ఆమె ఉద్వేగానికి లోన య్యారు. డైకస్‌రోడ్డులోని 14 ఏళ్ల బాలి కపై ఈ ప్రాంతంలోని బాషు అనే యువ కుడు ప్రతిరోజు ఇంట్లో ఎవరులేని సమ యంలో వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ బాలిక అంగవైకల్యంతో బాధ పడుతుంది. ఆరవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబు ల్‌గా పనిచేసే కృష్ణయ్య తన ఇంట్లో బాడుగకు వుండిన పద్మ అనే వివాహితను లైంగికంగా వేధించాడు. హెడ్‌కానిస్టేబుల్ ఈ పని చేయడంతో డిఎస్పీ మండి పడ్డారు. ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముంటున్న మరియమ్మ పైన ఆమె మరిది లైంగిక వేధింపులకు పాల్పడడంతో ఆమె కూడా డిఎస్పీని ఆశ్రయించింది. ఈ సంఘటనలపై ఆయా ప్రాంత పరిధిలోని స్టేషన్లలో కేసులు నమోదు చేయమని డిఎస్పీ, ఎస్ఐలను ఆదేశించారు.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్స్,
రాఘవ పేలెస్ ఎదురుగా, నెల్లూరు, సెల్: 9246435616, 9849495615

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

### వివాదంలో చదలవాడ

తిరుపతి మాజీ ఎమ్మెల్యే, నాయుడుపేట వాసి చదలవాడ కృష్ణమూర్తి పెద్ద వివాదంలో చిక్కుకున్నాడు. నాయుడుపేటకు చెందిన యువ న్యాయవాది ఒకరు తాను చదలవాడ కృష్ణమూర్తి కుమారుడనని దీనికి సంబంధించిన ఆధారాలున్నాయని వీటిని కృష్ణమూర్తి అంగీకరించాలని లేని పక్షంలో న్యాయపరమైన పోరాటం చేస్తానని ఆరోపిస్తున్నాడు. డిఎన్ఏ పరీక్షకు కూడా సిద్ధమని, తమ కుటుంబానికి ఆయన ఆస్థిలో చిల్లిగవ్వ కూడా అక్కరలేదని; కుమారుడనని ఒప్పుకొంటే చాలంటున్నాడు. ఈ వ్యవహా రాన్ని నాయుడుపేటలోని చదలవాడ అభిమానులు ఖండిం చడంతో రచ్చ రేగింది. జిల్లాలోని ఏ రాజకీయ నాయ కుడూ ఇటువంటి వివాదాల్లో కూరుకోలేదు. కృష్ణమూర్తి ఈ వ్యవహారాన్ని ఎలా చక్కదిద్దుకొంటారో వేచి చూడాలి.

### దొంగ ధైర్యం

నెల్లూరు ఎస్సీ కార్పొరేషన్ ఇడి బివిఎస్ నాగలక్ష్మిపై 11వ తేది ఆమె ఇంటికి దొంగతనానికి వెళ్లిన మధు యాసిడ్ దాడికి ప్రయత్నించాడు. అదృష్టవశాత్తు నాగలక్ష్మి తప్పించుకోవడంతోపాటు నిందితుడు మధు దొరికి పోయాడు. ఎన్టీఆర్ నగర్‌లోని ఎస్వీజిఎస్ కాలేజి సమీపంలో నాగలక్ష్మికి సొంత ఇల్లు వుంది. డ్యూటీ నుంచి రాత్రి ఇంటికి వెళ్లిన ఆమె తలుపుతీయగానే అలికిడి రావడంతో జీపు డ్రైవర్ కరుణాకర్, అటెండర్ రమణమూర్తిని అరచి పిలిచారు. వారు వచ్చి వెతకగా ఒక మొబైల్‌ఫోన్, బంగారు నగను దొంగిలించి మంచం క్రింద నక్కిన వ్యక్తి కనపడ్డాడు. వాళ్లు పట్టుకోబోగా తనతో తెచ్చుకొన్న యాసిడ్‌తో దాడి చేస్తానని తప్పించుకోబోతూ అన్నంత పని చేశాడు. కానీ కాలం కలసిరాక దొరికిపోవడంతో అతన్ని ఆరవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారమై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. లోతు దర్యాప్తులోగానీ అసలు విషయాలు తెలియవు.

### పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో విద్యుత్ వినియోగం వివరీతంగా పెరిగిపోయిన దృష్ట్యా కోతలు అనివార్యమవుతున్నా యంటున్నారు ట్రాన్స్‌కో ఎస్ఇ అశ్వద్ధ నారాయణ. గత ఏడాది ఆగస్టు నెలలో ఈ రోజుల్లో ఐదు మిలియన్ల యూనిట్ల విద్యుత్ వాడకం చేయగా ప్రస్తుతం 6.6 మిలియన్లు వాడుతున్నారట. ఇది గత ఏడాదితో పోలిస్తే 12 శాతం ఎక్కువంటున్నారు. ఏడాదికేడాదికి డిమాండ్ పెరిగే ఈ రోజుల్లో పాత రోజులతో పోలిక పెడితే ఎలా ఎస్ఇ గారు.

### బ్యాంకుల సమ్మెతో ఇబ్బందిపడ్డ జనం

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు 6, 7 తేదుల్లో జిల్లాలోని జాతీయ బ్యాంకుల సమ్మె విజయవంతంగా జరిగింది. రెండు రోజులపాటు బ్యాంకుల కార్యకలాపాలన్నీ నిలిచి పోవడం వల్ల జనం నానాపాట్లు పడ్డారు. ఎటిఎంలలో సైతం డబ్బు పెట్టకపోవడంతో ఈ మధ్య వీటి ద్వారా డబ్బులు డ్రా చేయను అలవాటుపడ్డ వాళ్లు ఇబ్బందులు పడ్డారు. బ్యాంకుల సమ్మె మూలంగా జిల్లాలో 150 కోట్ల రూపాయల మేర ఆర్థిక లావాదేవీలు స్తంభించి పోయాయి.

### పంచాయితీ సిబ్బంది సమ్మె 19 నుంచి!

జిల్లాలో పంచాయితీ కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది తాము ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. 961 పంచాయి తీల్లోని బిల్ కలెక్టర్లు, గ్రామ కార్యదర్శులు, విస్తరణాధికారులు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఈ సమ్మెలో పాల్గొననుండడంతో గ్రామపాలన స్తంభించే అవకాశాలున్నాయి.

### ప్రసన్నపై సోమిరెడ్డి ధ్వజం!

కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజ మెత్తారు. 7వ తేది పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతిలో కీలుబొమ్మలా మారి సిఎల్పీ నుంచి వచ్చిన లేఖలపై సంతకం చేస్తున్నావు. ఆర్థిక ప్రయోజనాల కోసమే రాజకీయ విలువలను రోడ్డున పడేశావు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటున్నావు. సత్తా వుంటే తిరిగి కోవూరులో పోటీచేసి గెలవమని ప్రసన్నకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి, జడ్పీలో తెలుగుదేశంపక్ష నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

### కసుమూరు దర్గా పాలకవర్గంలో సంక్షోభం

రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా పాలకవర్గంలో సంక్షోభం ఏర్పడింది. దర్గా ఛైర్మన్‌గా ఎస్‌బిటి చాంద్ బాష రెండవసారి నియమించడంతో పాలకవర్గ సభ్యులు ఎనిమిది మంది రాజీనామా చేశారు. చాంద్ బాషాను సైతం రాజీనామా చేయ మని వాళ్లు ఒత్తిడి చేయడంతో ఆయన ఖంగు తిన్నాడు. చాంద్ బాషను దర్గా ఛైర్మన్‌గా నియమించడంలో నెల్లూరు మేయర్ భానుశ్రీ ప్రమేయముంది. స్థానికులకు ఆయన రెండోసారి నియామకం ఇష్టం లేకపోవడంతో తిరగబడ్డారు.

### బయటకురాని ఇజ్జత్ టిక్కెట్

రైళ్లలో ప్రయాణించే సన్నకారు జనాలకు మేలు చేకూర్చే వంద కిలోమీటర్లలోపు ప్రయాణానికి 25 రూపాయలకే నెలసరి టిక్కెట్ లభించే 'ఇజ్జత్' పథకానికి జిల్లాలో ఇంతవరకు బోణీ కాలేదు. ఈ టిక్కెట్ పొందాలంటే కలెక్టర్, ఎమ్పీ లేదా డిఆర్ఎంలు ఆదాయాన్ని ధృవీకరించే సిఫార్సు లేఖ ఇవ్వాలి. కలెక్టర్‌ను ఈ లేఖ ఇవ్వమని 10వ తేది జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కొందరు కలసి అభ్యర్థించినా ఆయన సానుకూలంగా స్పందించలేదు. మొత్తం మీద ఇజ్జత్ టిక్కెట్‌కు జిల్లా ఇజ్జత్ లభించలేదనాలి.

### జమీన్‌రైతు సారథి



జమీన్‌రైతు రథ సారథిగా తన ఊపిరి వున్నంత కాలం సేవ చేసి తాను లేకున్నా కలకాలం జమీన్‌రైతు నిలిచేట్లు శ్రమించిన నిస్వార్థజీవి, జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్ **తూపిలి పార్థసారథి గారు** తనువు చాలించి 20తేదికి 30 సంవత్సరాలు నిండుతాయి. వారిని సంస్మరిస్తూ-

... జమీన్‌రైతు కుటుంబం

### హైవేపై మామూళ్ల వసూలుపై విచారణ

నెల్లూరు - వెంకటాచలం జాతీయ రహదారిపై తిరిగే ఐరన్‌ఓర్, ఇసుక, జాక్‌పాట్ లారీల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసుల వైఖరిపై ఎస్పీ మల్లారెడ్డి విచారణకు ఆదేశించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పోలీసు జీపును నిలుపుకొని వుంటున్న హైవే గస్తీ పోలీసులు వచ్చేపోయే లారీలను ఆపి రోజుకు 20 వేలు సంపాదిస్తున్నారట. ఈ మొత్తంలో కొంత ఆర్మ్‌డ్ రిజర్వుడు ఆర్ఎస్ఐకు ఇస్తున్నారట. ఈ వ్యవహారం వాస్తవమని తేలడంతో కొందరు పోలీసులపై ఎస్పీ వేటు వేయనున్నారు.

### ఎస్సీ, ఎస్టీ కమిటీ పర్యటన

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమీషనర్, సభ్యులతో కూడిన కమిటీ 19, 20 తేదీల్లో నెల్లూరు, కావలిలో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తుంది.

### 11 లక్షలకే అపార్ట్‌మెంట్!

నెల్లూరు ఐదవ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని చింతారెడ్డిపాళెం రోడ్డులో ప్లాటినమ్ ప్రాజెక్ట్ నేతృత్వంలో నిర్మితమవుతున్న సిరి, ఆకాష్ టవర్ల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం 9వ తేది ఈ ప్రాంతంలోనే జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరంలో 11 లక్షల రూపాయలకు ఒక అపార్ట్‌మెంట్ ఇవ్వడం అపురూపమైన విషయమన్నారు. ఈ వెంచర్‌లోనే క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్, చిల్డ్రన్ పార్కు వుండడం ముదావహమన్నారు. వర్ధమాన సినీతారలు నవనీత్‌కౌర్, మధుశాలిని 9వ తేది ఈ వెంచర్‌లో అపార్టుమెంటులు బుక్ చేసుకొన్న వారికి తమ చేతులమీదుగా రసీదులు అందించారు. మేయర్ భానుశ్రీ, ప్లాటినమ్ ప్రాజెక్ట్ మేనేజింగ్ చంద్రశేఖర్, కార్పొరేటర్ ఊటుకూరు ఆదిశేషయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి శరణు వేడిన మంత్రి



జనం దృష్టిలో తమను దొంగలుగా ముద్రవేసిన ఇసుక తుఫాను తీరం దాటించడమెట్లో అర్థంకాక తలక్రిందులై పోతున్నాడు జిల్లామంత్రి ఆనం రామనారాయణరెడ్డి. ప్రతిపక్షాలు ఈ నిందవేసి వుంటే, ఏదో ఒకరకంగా తప్పించుకోవచ్చు. కానీ కాంగ్రెస్‌వాదులే ఆ పుణ్యం కట్టుకోవడంతో ముఖ్యమంత్రిని శరణు వేడక తప్పలేదు. ఆదివారం జిప సర్వసభ్య సమావేశానికి ముఖం చెల్లక ముఖం చాటేసిన ఆనం సోదరులిద్దరూ నేరుగా ముఖ్యమంత్రిని కలిసి ఈ గండం నుంచి గట్టెక్కించమని వేడుకొన్నారట. ఈ సమస్య ఆనం వారితో పాటు జిల్లాలో పార్టీని కూడా భ్రష్టు పట్టిస్తుందన్న నిజాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి నష్టనివారణ చర్యలు చేపట్టారు. మొదటగా నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను పిలిపించారు. నువ్వు పార్టీ కోసం కష్టపడుతున్నప్పటికీ, నెల్లూరు నగరంలో అనిల్ వర్గం, ఆనం వర్గం అనే తేడా వస్తున్నది. అది పార్టీకి మంచిది కాదు కాబట్టి, మంత్రితో సర్దుకపోమ్మని హితవు చెప్పాడట. ఎన్నికలలో ఓడిపోయినా వెనక్కుతగ్గకుండా పార్టీ కోసం పని చేస్తున్నందుకు భుజం తట్టి పంపించాడు.

ఆ వెంటనే జిప ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి కూడా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. ఈ వార్త వ్రాసే సమయానికి ముఖ్యమంత్రితో వారి కలయిక జరగలేదు కాబట్టి, వారిని పిలిపించడంలో ముఖ్యమంత్రి ఉద్దేశం ఏమిటో చెప్పలేక పోతున్నాము.

నిన్నటి వరకు జిల్లాలో తమ ఒక్కరిదే అధికారం అన్న అహంకారంతో విర్రవీగారు ఆనం సోదరులు. ఇసుక దొంగతనం బయటపడడంతో, తామెంత బలహీనులమో తమకు తామే బయటపెట్టుకొన్నారు. రాజకీయాలలో పసిబాలుడి వంటి వాడు అనిల్‌కుమార్ యాదవ్. ఆ పిల్లవాడి తాకిడి భరించలేక ముఖ్యమంత్రి సహకారం కోరడం కంటే రాజకీయ అవమానం మరొకటి వుండదు. డబ్బు కోసం కక్కుర్తిపడి పాడు పనులు చేస్తే ఫలితం ఇట్లానే వుంటుంది మరి.



ఇసుక కుంభకోణాన్ని చూస్తూ ఊరుకొన్న మైనింగ్ ఏడిపై జడ్పీ ఛైర్మన్ ఆగ్రహం.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### ఆయన ఇంగ్లీషు మాట్లాడుతాడు!

నెల్లూరు జడ్పీ వైస్‌ఛైర్మన్ టివిఎస్ రాజా జిల్లాలోని మెట్టప్రాంతమైన ఉదయగిరి నుంచి వచ్చిన వ్యక్తి. ఎంఏ చదివిన ఆయన మెట్ట వేదాంతం బాగా మాట్లాడుతాడు. జడ్పీ సమావేశాల్లో వేదికపై కూర్చొనివుండే ఆయన సహజంగా ఒకటి రెండు ప్రశ్నలు మాత్రమే అడుగుతారు. వాటికి అధికారులు సరైన సమాధానం చెప్పకపోతే బిపి పెరిగి బూతులందుకొంటారు. ఈ విషయాన్ని 9తేది జరిగిన జడ్పీ సమావేశంలో ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమాషాగా ప్రస్తావిస్తూ వైస్‌ఛైర్మన్ గారి ప్రశ్నలకు టక టక సమాధానాలివ్వండి... లేకుంటే ఆయన ఆవేశంతో ఇంగ్లీషులో మాట్లాడుతారనేసరికి సభ్యులంతా పకపక నవ్వుకొన్నారు.



### ప్రసన్న వైఎస్ భజన

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 'ఆకర్ష్'లో పడిన తెలుగుదేశం శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్వంత పార్టీకి వ్యతిరేకంగా అసెంబ్లీ లోపలా, బయట చేస్తున్న ఆగానికి ఆ పార్టీ బిక్కచచ్చిపోతూంది. ఈవారంలో జరిగిన నెల్లూరు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రసన్న చేసిన వైఎస్ భజన సభలో వున్నవారందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. సమావేశపు అజెండాలోని వ్యవసాయం, విద్యుత్, కరవు, ఉపాధిహామీ, ఇందిరమ్మ ఇళ్లపై చర్చ జరిగినప్పుడల్లా ఆయన మధ్యలో లేచి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి వల్లే ఈ పథకాలు సాధ్యమయ్యాయని చెక్క భజన చేశారు. ప్రసన్న 'భజన' సభలోని నల్లపరెడ్డి కుటుంబ అభిమానులను బాగా బాధపెట్టింది. గూడూరు డివిజన్‌కు చెందిన ఒకరిద్దరు జడ్పీటిసిలు ధైర్యంచేసి... సార్ మరీ అసహ్యంగా వుందని ప్రసన్నతో ముఖాముఖి చెప్పారంటే ఈ భజన ఏస్థాయిలో వుండిందో అర్థం చేసుకోవచ్చు.



### ఆదాలకు కోపం వచ్చింది

ఎమ్మెల్యేగా ఇప్పటికి మూడుసార్లు గెల్చాడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి. ఎన్నికల సమయంలో మంచి మేనేజ్‌మెంట్ ప్రదర్శించి గెలిచేస్తుంటాడని ఆయన ప్రత్యర్థులు సైతం ఒప్పుకొంటారు. అటువంటి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈమధ్య తన ధోరణి మార్చుకొన్నారు. ప్రజాసమస్యలపై జిల్లా అధికారులను తీరిక చేసుకొని మరీ కలుస్తున్నారు. ముఖ్య సమస్యలను వారికి అర్థమయ్యేలా చెబుతున్నారు. జిల్లాలో 56వేల హెక్టార్లలో రెండోకారుగా వేసిన వరిపంట కోతకు వచ్చివుంది. కాని జిల్లాలోని రైసు మిల్లర్లంతా ఒక రింగుగా ఏర్పడి పాతపంటనే పుట్టి ఏడువేల నుంచి 7,500లోపు ధరకు కొంటున్నారు. కాని మార్కెట్‌లో బియ్యం మాత్రం 34రూపాయలకు నిలబెట్టి అమ్ముతున్నారు. పక్షం రోజుల్లో మార్కెట్‌లోనికి వచ్చే రెండవ పంటకు సంబంధించిన ధాన్యాన్ని మిల్లర్లు, దళారులు కలిసి మరీ ధర తగ్గించేస్తారని ఆదాల, జిల్లా కలెక్టర్‌ను కలసి వివరంగా చెప్పారు. ఈ విషయమై ఉదాసీనంగా వ్యవహరిస్తే జిల్లా రైతులు అన్యాయమై పోతారని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాస్త గట్టిగా చెప్పడంతో కలెక్టర్ సైతం విస్తుపోయారు. మిల్లర్లు, దళారులు ఆదాలకు తమపై ఎందుకిలా కోపమొచ్చిందో తెలియక జుట్టు పీక్కొంటున్నారు.

### హాస్టల్ విద్యార్థులకు సిడిలా?

జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదువుకొనే విద్యార్థులకు ఆధునిక విద్య అందుబాటులోకి తెచ్చేందుకు వసతి గృహాల్లోనే కలర్ టివిలు, సిడి ప్లేయర్లు, సిడిలు సిద్ధంగా వుంచుతామని కలెక్టర్ రాంగోపాల్ ప్రకటించారు. హాస్టళ్లలో ఏ సమయంలోనైనా విద్యార్థులు నిపుణులు చెప్పిన పాఠాలు సిడిల ద్వారా చూడొచ్చు... లేకుంటే వినొచ్చు అంటున్నారాయన. వార్డన్లు, మ్యాట్రిన్లు అసలే వుండని హాస్టళ్లలో ఆధునిక సౌకర్యాలు వినియోగించుకొని ఎటువంటి సిడి'లు విద్యార్థులు చూస్తారోనన్న 'శంక' సాంఘిక సంక్షేమ అధికారులను పట్టిపీడిస్తున్నది. నాలుగురోజులు వేచిచూస్తేగాని ఈ ప్రయోగ ఫలితాలు కానరావేమో!

### వాళ్ల ఫేసులు చూడనీయండి!

ఎలక్ట్రానిక్ మీడియా విస్తరించడం మూలం గా ముఖ్య సభలు, సమావేశాల్లో పాల్గొనే సభ్యులకన్నా మీడియా వాళ్లే ఎక్కువ సంఖ్యలో వుంటున్నారు. 9తేది జరిగిన నెల్లూరు జడ్పీ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్లు, ప్రింట్ మీడియా ఫోటోగ్రాఫర్లు దడి కట్టేయడంతో ఎవరు ఏం మాట్లాడుతున్నారో జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అర్థం కాలేదు. దీంతో ఆయన సున్నితంగా కాస్త ప్రక్కకు తొలగండి వాళ్లు సీరియస్‌గా మాట్లాడుతున్నారా... కామెడీగా మాట్లాడుతున్నారా తెలుసుకోవాలంటే ఫేసులు చూడక్కరలేదా అని మీడియాకు 'వాత' పెట్టాడు.



### మీసం మెలేసిన పరసా!

సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం స్వర్గీయ ఎన్టీరామారావుకు వీరాభిమాని. భాగ్యనగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ఆచార్యునిగా పనిచేస్తూ ఎన్టీఆర్ మీద అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చారాయన. ఆయన పాల్గొనే సమావేశాలు, సభల్లో ఎన్టీఆర్‌లా చేతులూపుతూ మాట్లాడుతుంటారాయన. 9తేది నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో ఎన్టీఆర్ తరహాలో డైలాగులు వల్లిస్తూ వివిధ సమస్యలపై ఆయన మాట్లాడిన తీరుకు జిల్లా అధికారులతోపాటు సభలోని సభ్యులు ముక్కున వేలేసుకొని మరీ విన్నారు. డివిఎస్ కర్ణ చిత్రంలో ఎన్టీఆర్ మాదిరి ఆయన సమావేశంలో తరచూ మీసం మెలేయడం చర్చనీయాంశమయ్యింది.

## చెత్తబుట్టల పంపిణీలో అవినీతి

చెత్తను తొలగించడానికి రాష్ట్రప్రభుత్వం అన్ని మునిసిపాలిటీలలో ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. అధికారులు, కాంట్రాక్టర్లు అక్రమాలకు, అవినీతికి పాల్పడడంతో గూడూరు మునిసిపాలిటీలో ఈ కార్యక్రమం అభాసుపాలైంది. 12వ ఆర్థిక సంఘం నిధులతో తిరుమల ఏజన్సీ ద్వారా 18వేల చెత్త బుట్టలను అధికారులు కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడడంతో చెత్తబుట్టలు పంపిణీ చేసిన రెండు రోజులకే అన్నీ చోట్ల పెళ్లుమంటూ విరిగిపోయాయి. కౌన్సిలర్లు దీనిపై గోల చేయడంతో సరఫరా నిలిపి వేశారు. వీటిని సప్లై చేసిన ఏజన్సీకి నోటీసులిచ్చినా

**పంపిణీచేసిన రెండురోజులకే పెళ్లుమంటూ విరిగిపోయాయి**

సమాధానం లేదు. నిబంధనల ప్రకారం నిర్దేశించిన బరువుకు అనుగుణంగా చెత్తబుట్టలను కొనుగోలు చేయాల్సి వుండగా పరమ నాసిరకంగా, తేలికపాటిగా వుండే వాటిని కమీషన్లకు కక్కుర్తిపడి తీసుకోవడంతో కాంట్రాక్టర్‌కు లాభం చేకూరింది తప్ప మునిసిపాలిటీ ఖజానాకు గండి పడింది. లక్ష్యం నీరుగారిపోయేందుకు కారణమైంది. ఇంత జరిగినా ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టేందుకు ఏ అధికారికి, పాలకులకు ఎవ్వరికి ధైర్యం లేకపోవడంతో సంపూర్ణ చెత్త నిర్మూలన పథకం చిత్తయిపోయింది.

## అద్దె భవనాల్లో అంగన్‌వాడి కేంద్రాలు

పొదలకూరు మండల పరిధిలో సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో భాగంగా నడిచే అంగన్‌వాడి కేంద్రాలు అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. శాశ్వత భవనాలు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం వండేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందజేసే బియ్యం, పప్పు, నూనె తదితర వస్తువులను నిల్వ చేసుకొనే గదులు లేక సిబ్బంది ఇళ్ల వద్దే ఉంచుకొంటున్నారు. పొదలకూరు పరిధిలో మొత్తం 191 అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. రాపూరులోని 11 కేంద్రాలను కూడా పొదలకూరులో విలీనం చేశారు. 172 కేంద్రాలలో 55 స్కూళ్ల ఆవరణల్లో, 11 కమ్యూనిటీహాళ్లలో, 9 పంచాయితీ కార్యాలయల్లో, నాలుగు దాతలు ఇచ్చిన గదుల్లో నడుస్తున్నాయి. 93 కేంద్రాలు అద్దె భవనాల్లో వున్నాయి. సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ప్రకటన చేస్తున్నా ఆచరణలో అమలు కాక పోవడంతో అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో అంగన్‌వాడి కేంద్రాలను నిర్వహించాల్సి రావడం ఇబ్బందిగా వుంది. ఇప్పటికైనా మంత్రి, శాసనసభ్యులు ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు కోరుకొంటున్నారు.




సమ్మెతో మూతపడిన నెల్లూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్.

## జాలర్ల వివాదం

చేపల వేటకు వలను వాడుకొనే విషయంలో నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసిన సంఘటన వెంకన్నపాళెం పట్టపుపాళెంలో జరిగింది. కొండూరు శ్రీరాములు, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్యలు ఉమ్మడిగా వలను చేపల వేటకు వినియోగించుకొంటున్నారు. వీరి కుటుంబాలకు చెందిన ఆడవాళ్ల మధ్య రేగిన చిచ్చు రాజకీయ రంగు పులుముకుంది. నిన్న మొన్నటివరకు బిజెపిలో వుండి ఇటీవల ఎన్నికలలో కాంగ్రెస్ పంచన చేరిన ఒక నేత దీన్ని తనకు అవకాశంగా మలచుకోవడంతో స్వల్ప వివాదం కాస్త రణరంగంగా మారి రాళ్లు, కొడవళ్లు, గొడ్డళ్లు, బరిసెలతో దాడి చేసుకొనే వరకు వెళ్లింది. తెలుగుదేశం పార్టీలో ఎక్కువమంది వుండటాన్ని జీర్ణించుకోలేక ఈ దాడికి ఉసికొల్పినట్లు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

## ఆత్మకూరులో ఎండుతున్న పంటలు

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలోని రైతాంగం దిక్కుతోచని స్థితిలో వుంది. చెరువులు, బావులు ఎండిపోవడంతో నీరు లేక పంటసాగు చేయలేక ఆందోళన చెందుతున్నారు. వరితోపాటు నిమ్మ, నారింజ, జామ, మామిడిపండ్లతోటలు ఎండిపోతున్నాయి. కళ్ల ముందే పంట భూములను బీడుపెట్టుకోవాల్సి రావడంతో రైతులు అల్లాడిపోతున్నారు. సన్నకారు రైతులు పొలం పనులకు స్వస్తి చెప్పి ఉపాధి పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సోమశిల జలాశయంలో కొంతమేర నీరున్నా ఉత్తర కాలువ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో రైతుల అవసరాలు తీర్చలేనిస్థితి నెలకొనింది. ఆత్మకూరు మండలంలో జూన్ నెలలో 46 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి వుండగా 23.7 మి.మీ మాత్రమే నమోదైంది. ఖరీఫ్‌కు ఆయువుపట్టు అయిన జూలైలో 71 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి వుండగా కేవలం 8.2 మి.మీ మాత్రమే నమోదైంది. గత ఏడాది జూలైలో 37.2 మిల్లీ మీటర్లు, ఆగస్టులో 90 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఆగస్టులో సాధారణ వర్షపాతం కూడా నమోదయ్యే పరిస్థితులు కన్పించడం లేదు. ఈ ప్రాంతంలో సాధారణ విస్తీర్ణం 254 హెక్టార్లకు మించి ఈ ఏడాది రైతులు 558 హెక్టార్లలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. 45 హెక్టార్లలో సజ్జ, 40 హెక్టార్లలో పత్తి, 20 హెక్టార్లలో చెరకు సాగులో వున్నాయి. చెర్లోయడవల్లి చెరువు చుక్కనీరు లేకుండా ఎండిపోవడంతో ఆయకట్టు క్రింద వున్న 240 ఎకరాల బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

**సోమశిల ప్రాజెక్టు వుండీ, దండగ!**

## విద్యపట్ల నిర్లక్ష్యం తగదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత తగ్గిస్తున్నాయని బిజెపి జాతీయనేత ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో వెంకటాచలం, ముత్తుకూరులలో బ్రిడ్జి స్కూళ్లలో చదివే విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాన్ని తూర్పార బట్టారు. ప్రాథమిక విద్య, ఉన్నత విద్యకు సోపానమని, అలాంటి దాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉన్నత ప్రమాణాలతో గ్రామీణ పాఠశాలలు నెలకొల్పితే బాలకార్మికులు, బడిబయట వుండే పిల్లలు పాఠశాలలకు వస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశంలో 30 శాతానికిపైగా నిరక్షరాస్యులు వున్నారని వారందరినీ అక్షరాస్యులుగా చేయాల్సి వుందన్నారు.

## చుక్కలనంటుతున్న అద్దెలు

ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు ఏర్పడడంతోపాటు, ఇతరత్రా పరిశ్రమలు ఏర్పాటు కానుండడంతో ఉద్యోగాలతోపాటు ఇళ్లకు డిమాండ్ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది పోర్టులో పని చేస్తున్నారు. నిర్మితమవుతున్న ఎపిజెన్‌కో, రిలయన్స్ తదితర పరిశ్రమలలో పని చేసేందుకు వేలాదిమంది కార్మికులుగా, ఉద్యోగులుగా విధులకు వస్తున్నారు. ఈ పరిస్థితులలో బాడుగ ఇళ్లకు గిరాకి ఏర్పడింది. చిన్న చిన్న ఇళ్లకు డిమాండ్‌ను బట్టి అధిక మొత్తాలకు అద్దెకు ఇస్తున్నారు. క్రొత్తగా ఇళ్లు నిర్మించే వారిసంఖ్య కూడా అధికమౌతు న్నది. పలుపురు గృహ యజమానులు అధికమొత్తానికి తమ ఇళ్లను బాడుగకు ఇచ్చి నెల్లూరుకు వలస వెళ్లి తక్కువ ధరలకు ఉంటున్నారు. ఇళ్లు అద్దెకు ఇప్పించేం దుకు దళారులు రంగంలో దిగి వున్నారు. తీయని మాటలతో చిన్న గదులు వుండే ఇళ్లను వేలాది రూపా యల అద్దెకు చేర్పిస్తూ కమీషన్ దండుకొంటున్నారు. పెద్ద భవనాలకు అయితే విపరీతమైన బాడుగ వసూలు చేస్తున్నారు. యజమానులు ఎక్కువ మంది విజయవాడ, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారే కావడంతో గృహయజమానులు ముక్కుపిండి అద్దె వసూలు చేస్తుండడంతో మండలంలో బాడుగ ఇళ్లను ఇచ్చే వారి సంఖ్య ఇటీవల కాలంలో అధికమైందనే చెప్పాలి.

## నిరుపయోగంగా ఆర్టీసి బస్టాండు

లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆత్మకూరులోని ఆర్టీసి బస్టాండు ప్రారంభించిన నాటి నుంచి నిరుపయోగంగా వుంది. బస్సులు ఇక్కడకు రాకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 1983లో మార్చి 3న డిపో ఏర్పాటుచేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించి కంట్రోలు పాయింట్, క్యాంటిన్, కొన్ని దుకాణాలను ఏర్పాటు చేశారు. అయితే డిపో నుంచి బయలు దేరే బస్సులు పంచాయతీ బస్టాండ్‌కు వెళ్లి అక్కడ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు వెళ్తున్నాయి. అక్కడ నుంచి తిరిగి డిపోకు తీసుకవస్తున్నారు. దీంతో ప్రయాణీకులు అక్కడకే వస్తుండడంతో ఆర్టీసి బస్టాండులో బస్సులు నిలవకపోవడంతోపాటు అక్కడ వుండే క్యాంటిన్‌లు, అంగళ్లు మూతపడ్డాయి. ఆర్టీసి బస్టాండుకు పొరపాటున వచ్చిన ప్రయాణీకులు పంచాయితీ బస్టాండుకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. సమయం వృధా కావడంతోపాటు అదనంగా వ్యయం అవుతుండడంతో ప్రయాణీకులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసి బస్టాండు నుంచి బస్సులు తిరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కోరుకొంటున్నారు.

# రెవిన్యూ ఉద్యోగిపై ఎంపిపి తడాఖా

రాజకీయనాయకులు తలచుకొంటే కానిదంటూ ఏమీ వుండదు అనేందుకు రెవిన్యూ అధికారి బదలీ ఒక ఉదాహరణ. ఈదూరు బిట్-2లో సుబ్బయ్య రెవిన్యూ అధికారిగా పని చేస్తున్నాడు. ఆయన వరిగొండకు చెందిన తెలుగుదేశం పార్టీ నేత చినబాబిరెడ్డికి, గోడౌన్, రైసుమిల్లుకు విద్యుత్ కనెక్షన్, సర్టిఫికేట్ ఇవ్వడంతో అగ్గి మీద గుగ్గిలమయ్యాడు మండల అధ్యక్షుడు టంగుటూరు శ్రీనివాసులరెడ్డి. నాకు తెలియకుండా సర్టిఫికేట్ ఎలా ఇస్తావని, తక్షణం దానిని రద్దు చేయమని హుంకరించాడు. అయినా ఆ రెవిన్యూ ఉద్యోగి వీలు పడదని తెగేసి చెప్పడంతో ఆగ్రహించిన ఎంపిపి పట్టుబట్టి మరీ ఆ ఉద్యోగిని బోగోలు మండలానికి బదలీ చేయించాడు. ఆయనే స్వయంగా ఈ విషయం అందరికీ చెప్పుకొంటున్నాడట. నా మాట వినకపోతే ఎవరినీ వదలను, గతంలో ఎంపిడివో వసుమతిని ఇలాగే బదలీ చేయించానని చెప్పుండడంతో ఉద్యోగులు ఇదెక్కడి కక్ష సాధింపని వ్యాఖ్యానిస్తున్నారు. రెవిన్యూ ఉద్యోగి సుబ్బయ్య మాత్రం అన్యాయంగా తనపై వేటు వేశారని వాపోతున్నాడు. సొసైటీ అధ్యక్షుడైన బాబిరెడ్డికి, జాఫర్‌సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరి ఛైర్మన్ దువ్వూరు సురేంద్రనాథ్‌రెడ్డి కూడా సిఫార్సు చేశాడని ఇందులో తాను చేసిన తప్పేంటని ప్రశ్నిస్తున్నాడాయన.


నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఖరిని తూర్పారపడుతున్న జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

# ప్రయాణీకుల అగచాట్లు

ఆత్మకూరు పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆర్టీసి బస్సుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రూట్లలో ప్రయాణీకులకు తగినంత బస్సు సౌకర్యం లేకపోవడంతో తిప్పలు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో అరకొరగా తిరిగే బస్సుల టాప్ ఎక్కి ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒక వైపు ఆర్టీసి భద్రతా వారోత్సవాలు, నాణ్యతహామీ పక్షోత్సవాలు జరుపుతున్నా, మరోవైపు బస్సులపైనా అధికసంఖ్యలో ప్రయాణీకులు ఎక్కి ప్రయాణించడం ఆర్టీసి బస్సుల నిర్వహణా వైఫల్యాన్ని ప్రస్ఫుటింపజేస్తున్నది. ఆయా ప్రాంతాలలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో వుండడంతో ప్రమాదాల బారిన పడే అవకాశాలు వుండడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి ఆత్మకూరు నుంచి మహిమలూరు ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఇప్పటికైనా ఆర్టీసి అధికారులు ప్రయాణీకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి అవసరమైన ప్రాంతాలలో బస్సుల సంఖ్య పెంచాల్సి వుంది.



నెల్లూరు శబరి శ్రీరామక్షేత్రంలో రామకోటి పుస్తకాలను భద్రపరిచే స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న పెద్ద జియ్యర్‌స్వామి.

# కొళాయి కనెక్షన్లకు గిరాకీ

ఆత్మకూరు గ్రామ పంచాయితీలో వ్యక్తిగత కొళాయి కనెక్షన్లకు గిరాకి పెరుగుతోంది. ఆత్మకూరు త్వరలో మునిసిపాలిటీగా మారనుందనే ప్రచారంతో కనెక్షన్లకు చెల్లించే మొత్తం పెరుగుతుందేమోనన్న భావనతో ముందుగానే గ్రామ పంచాయితీ లెక్కలోనే వీటిని తీసుకోవాలన్న ఆలోచనతో అధికసంఖ్యలో కొళాయి కనెక్షన్లను పొందేందుకు బారులు తీరుతున్నారు. పేద ప్రజలు వ్యక్తిగత కొళాయి కనెక్షన్ గురించి పట్టించుకోకపోయినా, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వీటిని తీసుకొనేందుకు ఆరాటపడుతున్నారు. అయితే కొళాయి కనెక్షన్ కోసం చెల్లించే మొత్తం, కేటాయింపులపై పలురకాల సందేహాలు ఏర్పడుతున్నాయి. ఒక్క కనెక్షన్‌కు 3వేల రూపాయల వరకు వసూలు చేస్తుండడంతోపాటు దరఖాస్తుదారులు మెయిన్ పైపులైను నుంచి తమ ఇంటి వరకు సొంత ఖర్చులతో గుంట త్రవ్వుకోవాల్సిరావడంపై ప్రజల్లో నిరసన వ్యక్తమౌతోంది. మరోవైపు డబ్బులు చెల్లిస్తామని దరఖాస్తుదారులు ముందుకు వస్తున్నా అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలూ వ్యక్తమౌతున్నాయి.


నెల్లూరు వచ్చిన ఆర్టీసి మేనేజింగ్ డైరక్టర్ దినేష్‌రెడ్డిని కార్మికులు సన్మానిస్తున్న దృశ్యం.

## మట్టిపాముల వేట

మట్టిపాముల అన్వేషణ జిల్లాలో పలు ప్రాంతాలలో కొనసాగుతూనే వుంది. మందుల తయారీకి మట్టిపాములు అవసరమని, వాటి బరువును బట్టి ధర చెల్లిస్తారనే ప్రచారం ఊపందుకోవడంతో జిల్లావ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా చెట్లు, పుట్టల వెంట పరికించినా మట్టిపాముల కోసం వెతికే వారే కన్పడుతున్నారు. ఈ జాడ్యం ముత్తుకూరు మండలాన్ని తాకింది. మండల కేంద్రంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో సైతం అధిక సంఖ్యలో యువకులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా వీటికోసం అన్వేషిస్తున్నారు. రెండు తలలు కలిగి మూడు కేజీల పైన బరువుగల పాము విలువ 3 లక్షల రూపాయల నుంచి 15లక్షల రూపాయల వరకు వుందని ప్రచారం జరగడంతో గిరిజనులతోపాటు పలువురు యువకులు పనులకు వెళ్లకుండా పాముల వేటలో తలమునకలై వున్నారు. ఒక్క పాము దొరికితే చాలు లక్షల ఆదాయం వస్తుందన్న ఆశతో విస్తృతంగా గాలింపు జరుగుతుండడంతో పలుచోట్ల కోలాహలం కన్పిస్తోంది. మట్టిపాములనుకొని విషసర్పాలను పట్టుకొనే ప్రయత్నంలో ప్రాణం మీదకు తెచ్చుకొంటున్నారు.

## ముసునూరు నీటి సమస్య

కావలి రూరల్ మండలంలో పలు ప్రాంతాలలో త్రాగునీటి సమస్య ఉత్పన్నం అవుతున్నది. పెద్ద పంచాయితీ అయిన ముసునూరు గ్రామంలో గత నెలరోజులుగా ప్రజలు త్రాగునీటికోసం అవస్థలు పడుతున్నారు. పంచాయితీ పరిధిలో షుమారు నాలుగు వేల మంది జనాభా వుండగా, వీరికి త్రాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ గ్రామంలోని మహలక్ష్మమ్మ దేవస్థానం వద్ద రక్షిత నీటి పథకాన్ని చాలా కాలం క్రిందట ఏర్పాటు చేసింది. ఇటీవల వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భజలాలు అడుగంటి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. చివరకు గొంతు తడుపుకొనేందుకు నీరు దొరకక కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొనింది. రక్షిత మంచినీటి పథకం వున్నా అది నిరూపయోగంగా మారడంతో గ్రామస్థులు మంచినీటి అవసరాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మంచినీటి సమస్యపై మండల పరిషత్ అధికారులకు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించుకొన్నా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.


యూత్ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నెల్లూరు రాజీవ్‌భవన్‌లో పతాకావిష్కరణ చేస్తున్న పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సిటీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్.

## బాబు బతికిపోయాడు



ఎన్నికల్లో పార్టీ ఓడినా చంద్రబాబుకు ఒకరకంగా మేలే జరిగిందని సిపిఐ కార్యదర్శి నారాయణ అంటున్నాడు. ఒకవేళ చంద్రబాబే గనక అధికారంలోకి వచ్చివుంటే ఆయనవల్లే వర్షాలు పడలేదని, కరువొచ్చిందని తాటాకులు కొట్టేవారు. అధికారంలోకి రాకపోవడంతో 'బాబు' బతికిపోయాడంటూ ఈ మధ్య నారాయణ కనబడిన వారికల్లా చెబుతున్నాడు. ఓటమిలో కూడా ఆనందాన్ని వెదుక్కోవడం అంటే ఇదేనేమో!!

## రోశయ్య ది 'ఫైర్'



రాష్ట్ర ఆర్థికమంత్రి 'రోశయ్య'ను 'ది ఫైర్' (నిప్పు) అంటూ కాంగ్రెస్ సభ్యులు ఆకాశానికి ఎత్తేస్తున్నారు. శాసనసభలో అయినదానికీ కానిదానికి తెలుగుదేశం సభ్యులపై విరుచుకు పడుతుండటంతో రోశయ్య టాక్ ఆఫ్ ది అసెంబ్లీ అయ్యారు. దీంతో రోశయ్య మరీ రెచ్చిపోతున్నాడు. అప్పుడప్పుడు అభ్యంతరకర వ్యాఖ్యలు కూడా చేస్తున్నాడు. అయితే తెలుగుదేశం సభ్యులు మాత్రం రోశయ్యపట్ల సానుభూతి చూపిస్తున్నారు. అసలే గుండెజబ్బు మనిషి, వయసు మీదపడుతోంది. ఆయన ఆరోగ్యం మీదనే మా ఆందోళన అంటూ మొత్తుకుంటున్నారు. ఈ విషయం కాస్తా రోశయ్య చెవిన పడింది. దీంతో రెచ్చిపోయిన రోశయ్య అంటే నన్ను నోరు మూసుకొని కూర్చోమంటారా! అంటూ ఆవేశంతో ఊగిపోయాడట. ఎంతైనా 'ఫైర్' కదా!

## బొత్సా 'అంజనేయులు'

రాష్ట్రమంత్రి బొత్సా సత్యనారాయణ సినీ ఫైనాన్సియర్‌గా మారారు. రవితేజ నటించిన 'అంజనేయులు' సినిమాకు ఆయన కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టినట్లు సినీ వర్గాలు బాహాటంగా చెవులు కొరుక్కుంటున్నాయి. సినిమాల్లో చిన్నసైజు కామెడీ పాత్రలు వేసుకునే 'గణేష్' ను నిర్మాతగా ముందుపెట్టి అంతా బొత్సావారే చూసుకున్నారట. అందుకే సుమారు 12 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ భారీ సినిమా రికార్డుస్థాయిలో 45 రోజులకే పూర్తయింది. బొత్సానా మజాకానా?



## 'రాములమ్మ' నోట వేదాంతం



మెదక్ ఎంపీ విజయశాంతి వేదాంతం మాట్లాడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ వచ్చేవరకు విశ్రమించేది లేదంటూ నానాహడావుడి చేసిన ఈ రాములమ్మ యిప్పుడేమో 'అంతా దేవుడి దయ' అంటూ చేతులెత్తేసింది. టీఆర్ఎస్ టిక్కెట్‌పై ఎన్నికల్లో గెలిచిన విజయశాంతికి ఆ పార్టీపై మొఖం మొత్తినట్లుంది. తాజాగా కాంగ్రెస్ పార్టీతో చెట్టపట్టాలేసుకుంటూ నియోజకవర్గంలో పర్యటిస్తోంది. 'ఏం రాములమ్మా తెలంగాణను ఏం జేసినావు?' అని అడిగితే మొఖం మాడ్చేసుకొని దండంపెడుతోంది.

## నన్నపనేనికి కోపం వచ్చింది



నన్నపనేని రాజకుమారికి చంద్రబాబుపై కోపం వచ్చింది. కారంచేడులో తనపై దాడిచేయించిన దగ్గుబాటి వెంకటేశ్వరరావును 'బాబు' వెనకేసుకొస్తున్నాడని ఆమె గుర్రుగా వుంది. తోడల్లుడన్న కారణంగా బాబు దగ్గుబాటికి వత్తాసుపలుకుతున్నాడని రాజకుమారి శాసనమండలి లాబీల్లో వాపోతోంది. తనపై దాడిచేయించిన దగ్గుబాటిని అసెంబ్లీలో నిలదీయకుండా బాబు తాత్సారం చేస్తున్నాడంటూ ఆడిపోసుకుంటోంది. బంధుత్వముంటే ఇంటిదగ్గర చూసుకోవాలి కానీ యిలా రాజకీయాల్లో చూపించడమేమిటంటూ 'బాబు'ను నిలదీసిందట. అవసరమైతే తాను రాజీనామా అయినా చేస్తాను కానీ దగ్గుబాటిని మాత్రం వదలనంటూ కొంగుబిగించే సరికి 'బాబు' నుతిమెత్తగా మందలించాడట. అప్పటినుంచి నోరుమెదపకుండా రాజకుమారి జాగ్రత్త పడుతోంది.

## 'ప్రసన్న' గొంతులో 'విప్పు' కాయ

ఎన్నికల్లో నెగ్గి వారం రోజులు కూడా కాకుండానే పార్టీ ఫిరాయించిన కోవూరు ఎమ్మెల్యే గొంతులో 'విప్పు' కాయపడింది. మంగళవారం అసెంబ్లీలో 40 మందికి పైగా 'దేశం' ఎమ్మెల్యేలు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో మిగతా ఎమ్మెల్యేలు కూడా సభలో వుండరాదంటూ ఆపార్టీ చీఫ్‌విప్ 'విప్' జారీ చేశారు. విప్‌ను ధిక్కరిస్తే శాసనసభ్యత్వాన్ని కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ఏంచేయాలో దిక్కుతోచని ప్రసన్న కాంగ్రెస్ నాయకులతో సంప్రదింపులు జరిపి ఆగమేఘాలమీద సభనుంచి బయటకు వచ్చేశాడు. పార్టీ ఫిరాయించడమంటే ఎంత కష్టమో ప్రసన్నకు యిప్పుడిప్పుడే తెలిసొస్తోంది.





## ఏడాదికే 'చిరు' పార్టీ ఖాళీ

ప్రజారాజ్యంపార్టీ ఏర్పాటై ఈనెల 26కు సరిగ్గా సంవత్సరమవుతోంది. పార్టీ ఆవిర్భావం నాటి వేడి యిప్పుడు పూర్తిగా చల్లారిపోయింది. ఆపార్టీ నుంచి ఒక్కొక్కరూ బయటకు వెళ్లి పోతుండటంతో దాదాపు చెప్పుకోదగ్గ నాయకులు కరువయ్యారు. ఇక చిరంజీవి సోదరులు పవన్‌కళ్యాణ్, నాగబాబు కూడా ఎన్నికల తర్వాత మొఖం చాటేశారు. పార్టీ తరపున గెలిచిన 18మంది ఎమ్మెల్యేల్లో సగం మంది అంటీ అంటనట్టున్నారు. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ శిబిరంలో తమ పేర్లు నమోదుచేయించుకున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం ఇబ్బందిగా తయారైంది. దీంతో రాష్ట్రంలో కరువు వుందన్న సాకుచూపి ఆవిర్భావ దినోత్సవ సంబరాన్ని వాయిదా వేయాలని పార్టీ వర్గాలంటున్నాయి. ఏం చేయాలో పాలుబోక పాపం 'చిరు' సతమతమవుతున్నాడు.



నిర్మలా కాంట్రాక్టర్స్ సంస్థ అధినేత బంది సంగిరెడ్డి కుమార్తె ప్రియాంక, ప్రదీప్‌ల వివాహం గతేది నెల్లూరు టిటిడి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.



# వినాయకుడి పుట్టు పూర్వోత్తరాలు

ఒకప్పుడు గజ (ఏనుగు) రూపంలో వున్న గజాసురుడు అనే రాక్షసరాజు పరమశివుడిని గురించి తీవ్ర తపస్సు చేయటం ప్రారంభించాడు. అతని తపస్సుకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై ఏదన్నా వరం కోరుకోమన్నాడు.

అప్పుడు గజాసురుడు "స్వామీ, మీరు ఎప్పుడూ నా ఉదరం లోపలే వుండాలి" అని కోరుకున్నాడు. మహేశ్వరుడు అతని కోర్కె తీర్చేందుకు గజాసురుడి పొట్ట లోపలికి ప్రవేశించి అక్కడే వుండటం మొదలుపెట్టాడు.

ఇదిలా వుంటే, కైలాసం (శివుడి ఇల్లు)లో వున్న పార్వతీదేవి భర్త గురించి తెలియక అన్నిచోట్లా వెతుకుతూ కొంతకాలానికి శివుడు గజాసురుడి పొట్టలో వున్నాడని తెలుసుకుంది. కానీ, శివుడిని ఏ విధంగా బయటకు రప్పించాలో తెలియక ఎంతో బాధపడి, చివరికి విష్ణుమూర్తిని ప్రార్థించి, తన భర్త విషయం చెప్పింది.

"ఓ మహానుభావా, పూర్వం భస్మాసురుని బారినుంచి నా భర్తని కాపాడి నాకు ఇచ్చావు. ఇప్పుడు కూడా ఏదన్నా ఉపాయం ఆలోచించు" అని కన్నీళ్లు కార్చింది. విష్ణుమూర్తి పార్వతీదేవిని ఓదార్చి పంపేశాడు.

అప్పుడు శ్రీహరి, బ్రహ్మ మొదలైన దేవతలను పిలిచి గజాసురుని చంపేందుకు గంగిరెద్దులను ఆడించేవాడిగా వెళ్ళటమే సరైనది అని నిర్ణయించాడు.

శివుడి వాహనం నందిని ఒక గంగిరెద్దుగా చేసి, బ్రహ్మ మొదలైన దేవతలచేత తలకొక వాయిద్యం ఇచ్చాడు. తాను చిరుగంటలు, సన్నాయి తీసుకుని గజాసురుడు వుండే గజాసురపురం దగ్గరకు వెళ్లాడు. అక్కడ గజాసురుడి ఎదురుగా చక్కగా నందిని ఆడించాడు. ఆ గంగిరెద్దుల ఆట చూచి గజాసురుడు ఆనందం పొంది, "మీకు ఏం కావాలో కోరుకోండి. నేను ఇస్తాను" అని చెప్పాడు.

అప్పుడు శ్రీహరి "ఇది శివుడి వాహనం నంది, శివుడిని వెదికేందుకే వచ్చింది కాబట్టి శివుడిని ఇవ్వు" అని కోరాడు.

ఆ మాటలకు నిర్ఘాంతపడిన గజాసురుడు గంగిరెద్దులను ఆడించేందుకు వచ్చినవాడు శ్రీహరి అని తెలుసుకుని, తనకు చావు తప్పదని అర్థం చేసుకున్నాడు. అపుడు తన పొట్టలోపల వున్న శివుడిని" నా శిరస్సు అందరికీ పూజ్యనీయంగా వుండాలి. నా చర్మం నువ్వు ధరించాలి" అని కోరుకున్నాడు. తర్వాత తనను చంపేందుకు శ్రీహరికి అనుమతి ఇచ్చాడు. నంది తన కొమ్ములతో గజాసురుడిని పొట్ట చీల్చగా, లోపల నుంచి శివుడు బైటకు వచ్చాడు.

హరి శివుడితో "చెడ్డవారికి ఇలాంటి వరాలు ఇవ్వకూడదు, ఇస్తే పాముకు పాలు పోసినట్టే అవుతుంది" అని చెప్పాడు. తర్వాత బ్రహ్మ ఇతర దేవతలకు వీడ్కోలు పలికి తాను కూడా వైకుంఠానికి వెళ్లిపోయాడు. శివుడు కైలాసానికి వెళ్లిపోయాడు.

### వినాయకుడి పుట్టుక

కైలాసంలో వున్న పార్వతీదేవి శివుడు వస్తున్నాడన్న వార్త విని తల స్నానం చేయాలని నిర్ణయించుకుని నలుగు పిండితో ఒక పిల్లవాడిని తయారు చేసింది. అతనికి ప్రాణం పోసి గుమ్మం ముందు వుంచింది. స్నానం చేసిన తర్వాత నగలతో అలంకరించుకుని శివుడి కోసం ఎదురు చూడటం మొదలుపెట్టింది.

ఇది ఇలా వుండగా, శివుడికి లోపలికి వస్తుండగా గుమ్మంలో వున్న పిల్లవాడు అడ్డు చెప్పాడు. కోపం తెచ్చుకున్న శివుడు త్రిశూలంతో ఆ బాలుడి కంఠం నరికాడు.

లోపలికి వెళ్లిన శివుడికి పార్వతీదేవి ఎదురువచ్చి పూజించి, కూర్చోబెట్టి మాట్లాడుతుండగా గుమ్మంలో వున్న పిల్లవాడి ప్రసక్తి వచ్చింది. అప్పుడు శివుడు తాను చేసిన పనికి బాధపడి, తాను తీసుక వచ్చిన గజాసురుడి శిరస్సును ఆ బాలుడికి అతికించి ప్రాణం పోశాడు. అతనికి 'గజాననుడు' అని పేరు పెట్టి, పెంచుకోవటం ప్రారంభించారు.

గజాననుడు కూడా భక్తితో తల్లితండ్రులకు సేవలు చేయసాగాడు. అనింద్యుడు అనే ఎలుకను వాహనంగా చేసుకుని తిరగటం మొదలుపెట్టాడు. కొంత కాలానికి పార్వతీ పరమేశ్వరులకు కుమారస్వామి పుట్టాడు. అతడు మహావీరుడు. నెమలి అతని వాహనము.

### విఘ్నేశాధిపత్యము

ఒకరోజు దేవతలు, మునులు, మానవులు పరమేశ్వరుని సేవించి, "విఘ్నములకు ఒక అధిపతిని ఇవ్వండి" అని కోరారు. తాను పెద్దవాడు కాబట్టి ఆ నాయకత్వ పదవి తనకే వుండాలని గజాననుడు కోరాడు. గజాననుడు పొట్టిగా వుంటాడు, తగిన అర్హతలు లేవు కాబట్టి ఆధిపత్యం తనకే ఇవ్వాలని కుమారస్వామి తండ్రిని కోరాడు.

శివుడు వారితో "మీలో ఎవరు మూడు లోకాల్లోని పుణ్య నదుల్లో స్నానం చేసి ముందుగా నా దగ్గరికి వస్తారో వారికి ఆ ఆధిపత్యం ఇస్తాను" అని చెప్పాడు.

కుమారస్వామి తన నెమలి వాహనం మీద ఎక్కి వేగంగా ముల్లోకాలూ తిరగటానికి వెళ్లిపోయాడు. గజాననుడు బాధపడుతూ తండ్రి దగ్గరికి వెళ్లి నమస్కరించి "అయ్యా, నా గురించి తెలిసి కూడా ఈ విధంగా చెప్పటం మీకు సరైనదా? మీ పాద సేవకుడిని, నాయందు దయ చూపి తగిన ఉపాయం చెప్పండి" అని కోరుకున్నాడు.

శివుడు "నారాయణ మంత్రం జపిస్తూ మూడుసార్లు మా చుట్టూ ప్రదక్షిణం చేయాలి. ఇది అన్ని తీర్థాలలో తిరిగిన స్నాన ఫలితాన్ని ఇస్తుంది" అని చెప్పాడు. వినాయకుడు అదేవిధంగా చేశాడు. ఆ మంత్ర ప్రభావం వల్ల గంగానదిలో స్నానమాడేందుకు వెళ్లిన కుమారస్వామికి తనకంటే ముందుగానే గజాననుడు ఆ నదిలో స్నానమాడి తనకు ఎదురుగా వస్తున్నట్లు అనిపించింది. అతినికి మూడు కోట్ల ఏభై లక్షల నదుల్లో కూడా తనకంటే ముందుగానే గజాననుడు స్నానం చేస్తున్నట్లు కనిపించాడు.

ఇది చూసి ఆశ్చర్యపోయి, కైలాసానికి వెళ్లి తండ్రి దగ్గర వున్న అన్నను చూసి, నమస్కరించి, తన బలాన్ని తిట్టుకుని "తండ్రీ, అన్నగారి మహిమ తెలియక ఆ విధంగా అన్నాను. క్షమించి ఆ ఆధిపత్యం అన్నగారికే ఇవ్వండి" అని ప్రార్థించాడు.

భాద్రపద శుద్ధ చతుర్థి రోజున పరమేశ్వరుడు గజాననుడికి విఘ్నాధిపత్యం ఇచ్చాడు. ఆ రోజు అన్ని దేశములవాళ్లూ విఘ్నేశ్వరుడికి తమ స్థాయిని బట్టి కుడుములు, మిగిలిన పిండి వంటలు, కొబ్బరికాయలు, పాలు తేనె, అరటి పళ్ళు, పానకము, వడపప్పు మొదలైనవి సమర్పించి పూజించారు. విఘ్నేశ్వరుడు సంతోషపడి కుడుములు కొన్ని తిని, కొన్ని తన వాహనం అనింద్యుడికి ఇచ్చి, కొన్ని చేతిలో పట్టుకుని, నిదానంగా సూర్యాస్తమయం అవుతుండగా కైలాసానికి వెళ్లాడు.

తల్లితండ్రులకు నమస్కారం చేయబోగా పొట్ట భూమికి తగిలింది కానీ, చేతులు మాత్రం భూమి మీద ఆనలేదు. అతి కష్టం మీద చేతులు ఆన్చినా నమస్కారం మాత్రం చేయలేకపోయాడు. ఈ విధంగా గణపతి కష్టాలు పడుతుండగా శివుడి తల మీద వున్న చంద్రుడు పగలబడి, ఎగతాళిగా నవ్వాడు. 'రాజదృష్టి సోకితే, రాళ్లు కూడా నుగ్గవుతాయి' అన్న సామెత అనుసరించి వినాయకుడి పొట్టపగిలి లోపల వున్న కుడుములు మొదలైనవి చుట్టుపక్కల దొర్లాయి. వెంటనే వినాయకుడు మరణించాడు.

పార్వతి ఏడుస్తూ చంద్రుని చూసి "పాపాత్ముడా! నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించాడు. కాబట్టి నిన్ను చూసిన వాళ్ళు పాపాత్ములై నీలాపనిందలు పొందుతారు" అని శపించింది.

### ఋషిపత్నులకు నీలాపనిందలు

అదే సమయంలో సప్త మహర్షులు యజ్ఞం చేస్తూ తమ భార్యలతో అగ్ని ప్రదక్షిణం చేస్తున్నారు. అగ్నిదేవుడు ఋషి పత్నులను చూసి మోహించి, మహర్షులు తనను శపిస్తారేమో అనే భయంతో రోజురోజుకూ బలహీనంగా మారిపోవనారంభించాడు. అది అగ్ని భార్య స్వాహాదేవి గ్రహించి అరుంధతీ రూపం తప్ప, మిగిలిన ఋషి పత్నుల రూపం ధరించి భర్తకు సంతోషం కలిగించింది. ఋషులు తమ భార్యల రూపంలో వున్న స్వాహాదేవిని చూసి తమ భార్యలే అనుకుని భ్రమపడి వారిపై కోపం తెచ్చుకున్నారు.

పార్వతి ఇచ్చిన శాపం ఫలితంగానే ఋషి పత్నులకు ఈ నీలాపనింద కలిగింది. దేవతలు, మునులు, ఋషి పత్నులు ఈ నీలాపనిందలను గూర్చి పరమేష్టికి తెలిపారు. అతడు సర్వజ్ఞుడు కావటంతో అగ్ని దేవుడి భార్యే ఋషి పత్నుల రూపం దాల్చిందని తెలుసుకుని సప్త ఋషులను సమాధానపరచి వారితో కూడా తాను కైలాసానికి వెళ్లి ఉమామహేశ్వరులను సేవించి చనిపోయిన విఘ్నేశ్వరుని బతికించాడు. దాంతో పార్వతీ పరమేశ్వరులు ఎంతో సంతోషించారు.

అప్పుడు దేవతలు, మిగిలినవాళ్లు "పార్వతీ, నువ్వు ఇచ్చిన శాపం వల్ల అన్ని లోకాలలో వున్నవారికి కీడు జరుగుతోంది. కాబట్టి దానిని ఉపసంహరించు" అని ప్రార్థించారు.

వారి ప్రార్థనలకు సంతోషించి పార్వతి సంతోషంతో కుమారుని దగ్గరకు తీసుకుని ముద్దాడి "ఏ రోజున వినాయకుని చూసి చంద్రుడు నవ్వాడో, ఆ ఒక్క రోజు మాత్రం చంద్రుని చూడకూడదు" అని చెప్పింది.

అప్పుడు బ్రహ్మ మొదలైన దేవతలు సంతోషిస్తూ తమ నివాసాలకు వెళ్లిపోయారు. భాద్రపద శుద్ధ చతుర్థిలో మాత్రం చంద్రుని చూడకుండా జాగ్రత్త తీసుకుని సుఖంగా వున్నారు.




వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సన్మాన సభలో మాస్టర్ ఆదర్శ్ నృత్యం.

# 42వ డివిజన్‌లో కుంటుపడిన పారిశుధ్యం

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్ళు కావస్తున్నా అభివృద్ధి పనుల విషయంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. ఎప్పుడూ పాలకవర్గంలో గ్రూపు తగాదాలు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వంటి కారణాలతో నగరాభివృద్ధి కుంటుపడుతుంది. పాలకవర్గంలోని ఒక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేటర్ల డివిజన్లకే అధిక శాతం నిధులు కేటాయించబడుతున్నాయి. మిగిలిన డివిజన్లకు నిధుల మంజూరు విషయంలో మొండిచేయి చూపుతున్నారు. దీనిపై ప్రతిపక్ష కార్పొరేటర్లు ఎన్నిసార్లు నిరసన తెలిపినా ఫలితం మాత్రం శూన్యం.

మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం అంటేనే నగర ప్రజలు అసహ్యించుకొంటున్నారు. డివిజన్లలో ప్రజలలో ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకొనేందుకు అధిక సమయం కేటాయిస్తున్నారు. ఇదే కోవలోకి వచ్చేదే 42వ డివిజన్. ఈ డివిజన్ నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన ధర్మవరపు సుబ్బారావు 2005 సంవత్సరంలో జరిగిన మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేటర్‌గా ఎన్నికైనారు. కార్పొరేషన్ పాలకవర్గంలో తెలుగుదేశం పార్టీ విప్‌గా కీలకబాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంలో బాగా వెనుకబడిపోయాడు. మూడు దఫాలుగా కార్పొరేటర్‌గా ఎన్నికైన అనుభవం వున్నప్పటికీ ప్రస్తుత పాలకవర్గంలో ప్రాధాన్యత దక్కడం లేదు. డివిజన్ పరిధిలోనికి కొరడావీధి, గిడ్డంగివీధి, అగ్నిపేట, ములుమూడి బస్టాండ్ పరిసర ప్రాంతాలు వస్తాయి.



### దోమలను నిర్మూలించాలి

దోమల బెడద అధికంగా వుంది. మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది వీధులను శుభ్రం చేయడం లేదు. దీంతో వీధులలో చెత్తాచెదారం పేరుకుపోయి, భరించలేని దుర్వాసన వస్తుంటుంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్ స్పందించి దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి.

-వరలక్ష్మి



### పారిశుధ్యం మెరుగుపరచాలి

పారిశుధ్యం చాలా అధ్వాన్నంగా వుంది. పారిశుధ్యం లోపించడం కారణంగా అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం వుంది. రోడ్లపై వేసిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో అక్కడ పందులు చేరి స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు, కార్పొరేటర్ స్పందించి చర్యలు తీసుకోవాలి.

- షేక్ అహ్మద్

42వ డివిజన్‌లో ప్రధానంగా పారిశుధ్య సమస్య, డ్రైనేజి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. పారిశుధ్యం నియంత్రించకపోవడం వల్ల రాత్రి సమయంలో దోమలబెడద అధికంగా వుంటుంన్నందున నిద్రపోలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. త్రాగునీటి సమస్య ఎప్పుడూ వుంటుంది. ఇన్ని సమస్యలతో డివిజన్ ప్రజలు వివిధ రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్‌కు చెందిన డివిజన్ కావడం వల్ల మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు. డివిజన్‌లో చేపట్టే పనుల గురించి కార్పొరేషన్ అధికారులకు అనేకదఫాలు ప్రతిపాదనలు అందజేసినా పనులు మంజూరులో తీవ్రజాప్యాన్ని ప్రదర్శిస్తున్నారు.



నడిరోడ్లో పారుతున్న మురికినీరు.



ఇళ్ల మధ్య మురికి మడుగు.

అవినీతి కథ

# నట్టల నివారణ నిధుల దుర్వినియోగం

**పై స్థాయి నుంచి క్రింది స్థాయి వరకు పశుసంవర్ధకశాఖలో ప్రతి ఒక్కరికి వాటాలు ముడుతుండడం వలన నిధుల దుర్వినియోగం జరుగుతున్న విషయం బయటకు పొక్కడం లేదు**

జిల్లా పశుసంవర్ధకశాఖకు రాష్ట్రప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయి. పశుపోషణ, దాణా విత్తనాలు, నట్టల నివారణ మందుల కొనుగోలు కోసం రాష్ట్రప్రభుత్వం నుంచి నిధుల విడుదల జరుగుతుంది. అయితే ప్రభుత్వం నుంచి వస్తున్న లక్షలాదిరూపాయల నిధులను సద్వినియోగపరచడం జరగడం లేదు. పై స్థాయి నుంచి క్రింది స్థాయి వరకు పశుసంవర్ధకశాఖలో ప్రతి ఒక్కరికి వాటాలు ముడుతుండడం వలన నిధుల దుర్వినియోగం జరుగుతున్న విషయం బయటకు పొక్కడం లేదు. తాజాగా ప్రభుత్వం నట్టల నివారణ కోసం దాదాపు 30లక్షల రూపాయలు ఇటీవల కేటాయించడం జరిగింది.

కేటాయించిన నిధులలో తొలి విడతగా జిల్లాకు 20లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగింది. నట్టల నివారణకోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులలో కొంతభాగం దుర్వినియోగం జరగ్గా, మరికొన్ని నిధులు స్వాహా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాయింట్ డైరెక్టర్ దగ్గర నుంచి మండల స్థాయి పశువైద్యాధికారి వరకు నిధుల పంపిణీ జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నట్టల నివారణకు అవసరమైన మందులను సంబంధిత ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాల్సి వుంటుంది. కొనుగోలు చేసిన మందులను జిల్లావ్యాప్తంగా వున్న పశువైద్యశాలలకు అందజేయాలి.

జిల్లా వ్యాప్తంగా ఎన్ని పశువులకు గాలికుంటు వ్యాధి సోకింది? మరెన్ని పశువులకు సోకే అవకాశం వుంది? వీటి నివారణకు ఎన్ని మందులు అవసరం అవుతాయి? అన్న పూర్తి వివరాలు పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో అందుబాటులో లేవు. బోగస్ నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేయించుకొని స్వాహా చేస్తున్నారే తప్ప పశువుల సంక్షేమం కోసం వీటిని ఖర్చు చేయడం లేదన్న ఆరోపణలు వున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురవక భూగర్భజలాలు అడుగంటిపోయి పంటలు వేయలేని పరిస్థితులు నెలకొని వున్నాయి.

పంటలు పండకపోతే పశువుల మేతకు తీవ్రకొరత ఏర్పడే ప్రమాదం కూడా వుంది. ఇటువంటి పరిస్థితులలో పశువుల మేతకు అధిక ప్రాధాన్యతనివ్వాల్సిన అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి సోకిందని ప్రభుత్వానికి నివేదించి నిధులు రాబట్టుకోగలిగారు. జిల్లా స్థాయిలోనే నిధుల దుర్వినియోగం, స్వాహా జరుగుతుంటే వీటి గురించి పట్టించుకొనే దిక్కు లేకుండా పోయారు. గాలికుంటువ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకొంటున్నామని అధికారులు చెబుతున్న గ్రామీణ ప్రాంతాల రైతులను కదిలిస్తే మాత్రం అధికారులు పత్తా లేకుండా పోయారని అంటున్నారు.




నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయం

పశుక్రాంతి పథకం ద్వారా పంపిణీ చేసిన పాడిపశువుల పరిస్థితి కూడా దయనీయంగా వుంది. ఇతర రాష్ట్రాలకు చెందిన పాడిగేదెలను పశుక్రాంతి పథకం ద్వారా కొనుగోలు చేసి లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఈ పాడి గేదెలకు మూడు నెలల పాటు పశుపోషణకు అవసరమైన నిధులను లబ్దిదారులకు మంజూరు చేయాలి. అయితే పశుసంవర్ధకశాఖ అధికారులు పశుపోషణకు దాణా అందజేయడం లేదు. పశుపోషణకు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని లబ్దిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని చెప్పి తప్పించుకుంటున్నారు.

పశుసంవర్ధకశాఖకు రాష్ట్రప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్లు అనేక ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే బాగుంటుంది.



## ప్రేమలో తమన్నా

హ్యాపీడేస్ చిత్రం హీరోయిన్ తమన్నాకు మంచిపేరు తెచ్చిపెట్టినా తెలుగు చిత్రాల్లో అవకాశాలు మాత్రం అంతంతమాత్రంగానే వచ్చాయి. అయితే తమిళ చిత్రపరిశ్రమలో తమన్నా నిలదొక్కుకోవడమేగాక అక్కడ హీరో భరత్‌తో ప్రేమాయణం సాగిస్తుందన్న వార్తలు వినవస్తున్నాయి. హిందీలో సూపర్‌హిట్ అయిన 'జబ్‌విమెట్' చిత్రం ఆధారంగా తమిళంలో తీస్తున్న చిత్రంలో తమన్నా, భరత్ కలసినటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ కొడైకెనాల్‌లో సాగుతుంది. తమన్నా ఆకర్షణలోపడిన భరత్ ఆమె ఎక్కడుంటే అక్కడికి వెళ్తున్నాడన్న వార్తలు యూనిట్‌సభ్యుల ద్వారా బయటకు పొక్కాయి. ఈ జంట ప్రేమ గూటిలో చిక్కుకపోయారంటున్నారు.

## శింబుకు పడని త్రిష

నయనతారతో ప్రేమాయణం దెబ్బతిన్న తమిళహీరో శింబు కళ్లు ఇప్పుడు త్రిషపై పడ్డాయి. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో శింబు, త్రిష కలసి నటిస్తున్నారు. త్రిషతో క్లోజ్ అయ్యేందుకు శింబు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా త్రిష మాత్రం శింబు విషయంలో చాలా రిజర్వ్‌డ్‌గా వుంటోందట. దీంతో శింబు, నయనతార అంత ఫ్రీడమ్ తనకు త్రిష వద్ద దొరకడం లేదని తన సన్నిహితుల వద్ద వాపోతున్నాడు. అయినా దగ్గరయ్యే ప్రయత్నాల్ని మాత్రం జోరుగానే కొనసాగిస్తున్నాడట. త్రిష, శింబుల మధ్య గ్యాప్‌తో ఈ చిత్రం షూటింగ్ సజావుగా సాగడంలేదని కోలీవుడ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.





## శ్రియ తిరుగుడు

శివాజి చిత్రం తర్వాత హిట్ కోసం కటకటలాడుతున్న శ్రియ 'మల్లన్న' చిత్రంపై ఆశలు పెంచుకొని వుంది. ఇదిలా వుండగా శ్రియ తమిళ హీరో నితిన్‌సత్యతో చాలా దగ్గరగా మసలుతుందని చెన్నై సినీవర్గాలు కోడైకూస్తున్నాయి. శ్రియ ఈ విషయాన్ని ఖండించ లేదు. పైపెచ్చు ఈ విషయమై మాట్లాడుతూ నితిన్‌సత్య నాకన్నా చిన్నవాడు... అతడితో నాకు లింకులేమిటి? అనవసరంగా నా ఇమేజ్ డామేజ్ చేస్తున్నారంటుంది. బెంగాలీ భామ బిపాసబసు తనకన్నా ఆరేళ్ల చిన్నవాడైన జాన్ అబ్రహంను ప్రియునిగా ఎంచుకొన్నట్లు శ్రియ కూడా నితిన్‌సత్యను ఎంచుకొన్నట్లుంది.

## భయపడ్డ మల్లికా!

హీరోయిన్ మల్లికా షెరావత్ ఎన్నో సినిమాల్లో చాలా బోల్డ్‌గా కనిపించినా న్యూడ్‌సీన్‌లో మాత్రం నటించే ధైర్యం చేయలేక పోయింది. మల్లిక నాగిని అవతారంలో కనిపించే 'హిస్' చిత్రంలో రెండు సన్నివేశాల్లో ఆమె నగ్నంగా కనిపించాల్సి వచ్చింది. వెనుక భాగం పూర్తిగా కెమెరాకు ప్రదర్శించాలి. అయితే మల్లికాకు బదులుగా ఆ సీన్‌లో బాడీ డబుల్‌ని వాడారు. అయితే ఈ సన్నివే శాలు సెన్సార్ ఆఫీసు దాటి బయటకు వస్తాయా అన్నదే సందేహం.



## చిత్ర సమీక్ష — నవరస సమ్మేళనం

అల్లూరు రహీం

సత్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నూతన దర్శకుడు బెల్లంకొండ సత్యం రూపొందించిన లోబడ్జెట్ చిత్రం స్నేహితుడా ఓ మోస్తరుగా




వుంది. పలువురు దర్శకుల వద్ద పనిచేసిన అనుభవంతో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నెరపిన సత్యం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చేయను ఈ చిత్రంలో నవరసాలను స్పృశించాడు. ఈ మధ్య విడుదలై విజయవంతమైన రైడ్ చిత్రం తరహాలో విభిన్నమైన పాయిం ట్‌తో చిత్ర ప్రథమార్ధం నడు స్తుంది. హీరో నానీ, హీరోయిన్ మాధవీలత పెద్ద ఇమేజ్‌లేని వారు కావడం వల్ల తన ఇష్టమొచ్చేలా వారిని మలచుకోవడంతో దర్శకుడు కృతకృత్యు డయ్యాడు. సీనియర్ నటులు నాజర్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, ఎం.ఎస్.నారాయణ, పృథ్వీరాజ్, కిన్నెర, అపూర్వ కాంబినేషన్‌లో నడిచే సన్నివేశాల్లో సీరియస్‌నెస్‌తోపాటు కామెడీ పార్ట్ దెబ్బతినకుండా బాగా తీశాడు. అయితే ఈ చిత్రానికి మాటలు వ్రాసిన భావశ్రీ కలం కొన్నిచోట్ల అదుపు తప్పింది. హీరోయిన్, హీరోను వుద్దేశించి రేయ్ నువ్వు అసలు మగాడివేనా... అనడంతో పాటు ఇంకాస్త ముందుకు కెళ్లడం కుటుంబ సమేతంగా చిత్రానికి వెళ్లినవారిని ఇబ్బంది పెడుతుంది. మరోచోట కంప్యూటర్ పరిభాషను బూతు డైలాగులకు తెలివిగా పలికించాడు. సెన్సార్‌బోర్డులోని మొద్దు బుర్రలకు ఇవి అర్థమైనట్లు లేవు. కొత్త సంగీత దర్శకుడు శివశంకర్ బాణీలు కూర్చిన ఇంతకు నువ్వెవరో పాట బాగున్నా నచ్చావులే పాట కాస్త కాపీయింగ్ జరిగినట్లు శ్రద్ధగా వింటే తెలిసిపోతుంది. ముద్దుపేరే సుశీల చరణంలో సాగే ఐటెంపాట సంగీతపరంగా బాగున్నా చిత్రీకరణ కాస్త అతిగా వుంది. ఒకప్పుడు అబ్బాయిలు అమ్మాయిలపై పడేవారు... ఇప్పుడు అమ్మాయిలు అబ్బాయిలపై పడుతున్నారు. తల్లిదండ్రులు అమ్మాయిలను ఎంసెట్ ఎగ్జామ్స్‌కు పంపినట్లు డేటింగ్‌కు పంపుతున్నారన్న డైలాగులు కాస్త ఆలోచింపజేస్తాయి. కోనసీమతోపాటు కేరళ అందాలను కెమెరామెన్ వాసు చక్కగా చిత్రీకరించాడు. సాగదీయకుండా రెండు గంటల 15 నిమిషాల నిడివితో 'స్నేహితుడా' చిత్రానికి శుభంకార్డు పడినతీరు బాగుంది.

చిత్రకథలోనికి వెళ్తే సాయి (నానీ) అనాథ. గాలికి తిరుగుతుంటాడు. రాత్రివేళల్లో మాత్రం డోర్‌లాక్ చేసివెళ్లే డబ్బున్నవారి ఇళ్లలోనికి అక్రమంగా ప్రవేశించి సేద తీరుతుంటాడు. ఆ ఇళ్లలో దొంగతనాలు మాత్రం చేయడు. ఈ విధంగా ఓ ఇంట్లోకి వెళ్లినప్పుడు హీరోయిన్ సావిత్రి (మాధవీలత) తారసపడుతుంది. ఆమె ఓ పల్లెటూరి పిల్ల. తండ్రి శ్రీనివాసరావు (నాజర్) ఆమెకు పెళ్లి సంబంధం విషయమై మాట్లాడను వియ్యాలవారిని రమ్మన్నరోజు క్లాస్‌మేట్స్‌తో కలసి బొటానిక్ టూర్‌కు వెళ్తుంది. మార్గమధ్యమంలో చేసిన తప్పు తెలుసుకొని ఇంటికి ఫోన్ చేస్తుంది. తండ్రి ఆ ఫోన్ రిసీవ్ చేసుకొని తన పరువు పోగొట్టి ఇంటి నుంచి వెళ్లినందుకు పొరపాటున కూడా స్వగ్రామానికి రావద్దంటాడు. నడిరోడ్డులో బస్సు దిగిన ఆమెను ఓ ఆకతాయి యువకుల గుంపు కిడ్నాప్‌చేసి ఓ బంగళాలో దాచిపెడతారు. రాత్రి నిద్రచేయను ఈ బంగళాకు వెళ్లిన సాయికి సావిత్రి తారసపడుతుంది. అక్కడనుంచి అతనితో బైక్‌లో తిరుగుతూ రాత్రివేళల్లో ఏదో ఒక ఇంట్లో నిద్రపోతుంటారు. ఓ రాత్రి వీరిద్దరు నిద్రచేయను ఓ ఇంటికి వెళ్లగా ఆ ఇంటి యజమాని దొంగల కత్తిపోట్లకు గురై వుంటాడు. అతనికి ప్రథమ చికిత్స చేయను సావిత్రి పూనుకోగా ఇన్స్‌పెక్టర్ (పృథ్వీరాజ్) వచ్చి వీరిద్దరిని అరెస్ట్ చేస్తారు. పోలీస్ రికార్డుల్లో తప్పిపోయిన అమ్మాయి జాబితాలో సావిత్రి ఫోటోచూసి సిఐ ఆమె తండ్రిని పిలిపిస్తాడు. ఆమెప్పుడో దారి తప్పిందని తనకు సంబంధం లేదని శ్రీనివాసరావు స్టేషన్‌లో తేల్చిచెప్పి వెళ్లిపోతాడు. అక్కడ నుంచి సాయి ఈ తండ్రి కూతుళ్లను ఒకటి చేయను శ్రీనివాసరావు పాత ప్రేయసి (అపూర్వ) కొడుకునంటూ ఆ ఇంట్లో చేరుతాడు. తన గదిలో సావిత్రిని రహస్యంగా వుంచుతాడు. కథ పలు మలుపులు తిరిగిన అనంతరం సాయి, సావిత్రిలకు శ్రీనివాసరావు పెళ్లి చేయడంతో సినిమా ముగుస్తుంది.

హీరో నాని ఇప్పటివరకు నటించింది మూడు చిత్రాలైనా అన్నింటా అతనికి చురుకైన పాత్రలు దొరకడం అదృష్టమే. హీరోయిన్‌గా గుంటూరు అమ్మాయి మాధవీలత చూడముచ్చటగా వుంది. నాజర్, బ్రహ్మానందం, ఎంఎస్ నారాయణతోపాటు టీవీ సీరియళ్లలో కనపడే సౌమ్యారాయ్, అమృతం సీరియల్‌లో కామెడీ పంచే నటులకు ఈ చిత్రంలో మంచిపాత్రలే దొరికాయి. టైమ్‌పాస్‌కు 'స్నేహితుడా' చిత్రానికి వెళ్లొచ్చు.

# సన్మానాల ఖర్చు 15 లక్షలు!



నెల్లూరు కార్పొరేషన్‌లో గతవారం హోంమంత్రి సన్మాన దృశ్యం

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం తీసుకొంటున్న అసాధారణ నిర్ణయాల కారణంగా కార్పొరేషన్ ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడుతున్నది. నగర ప్రజలు త్రాగునీటికి కటకటలాడుతుంటే ఈ సమస్యను పరిష్కరించేందుకు పాలకవర్గం ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా ఏ కార్యక్రమం చేపడితే కమీషన్లు వస్తాయా? అనే దానిపై మాత్రం ఆలోచిస్తుంటారు.

రాష్ట్ర మంత్రులు జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా పౌరసన్మానం పేరుతో భారీగా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాకు విచ్చేసిన ఆనం రామనారాయణరెడ్డికి తొలివిడత ఘనంగాను, ఎంతో ఆర్భాటంగా పౌరసన్మానం చేయడం జరిగింది. ఈ నెల 2వ తేది రాష్ట్ర హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జిల్లాఇన్‌చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణలు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ ఇద్దరు మంత్రులకు కూడా మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో పాలకవర్గం ఆధ్వర్యంలో పౌరసన్మానం జరిగింది. పై ముగ్గురు మంత్రుల పౌరసన్మానాల కోసం దాదాపు 15 లక్షల రూపాయలకు పైగా కార్పొరేషన్ ఖజానా నుంచి నిధులు ఖర్చు చేశారు. మంత్రుల పౌరసన్మానాల పేరుతో మేయర్

### కార్పొరేషన్ ఖజానాపై అదనపు ఆర్థిక భారం

ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నదని ప్రతిపక్ష సభ్యులు ఆందోళన, నిరసనలు తెలియజేసినా ఖాతరు చేయడం లేదు. పౌరసన్మానాల పేరుతో నిధుల దుర్వినియోగం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తే నగర ప్రజలు ఆమెను అభినందిస్తారు.



ఆదర్శ రైతుల వ్యవహారమై నిలదీస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

# అందరూ ఆదర్శ రైతులే!

కుక్క పిల్లా... అగ్గిపుల్లా... సబ్బు బిళ్ళా కాదేదీ కవిత కనర్హమంటూ మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు మన జిల్లా వ్యవసాయాధికారులు కూడా ఆదర్శ రైతులుగా సెంటు పొలంలేని వారిని ఎంపిక చేశారు. అంతటితో ఊరుకోలేదు. సైకిల్ షాపులు, టీ బంకులు, ఆటోడ్రైవర్లుగా పనిచేసే వారిని ఆదర్శ రైతులు చేశారు. కోవూరులో ఇంకాస్త ముందు కెళ్లి సినిమాహాళ్ల ఓనర్లను సైతం ఆదర్శ రైతులను చేశారని ఈ మధ్యే ఆకర్ష్ పథకంలో కాంగ్రెస్ పార్టీ గడప దగ్గర చేరిన కోవూరు శాసన సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి వాపోయారు. 9తేది జరిగిన జడ్పీ సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చ జరిగినప్పుడు ఆదర్శ రైతుల ఎంపికపై గూడూరు, సూళ్లూరు పేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన తెలియజేశారు. ఏ ప్రాతిపదికన వీరిని ఎంపిక చేశారో తెలియజేయమన్నప్పుడు ప్రసన్న కుమార్‌రెడ్డి వారికి మద్దతు పలికారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదర్శ రైతుల ఎంపికను అధికారులు గబ్బు పట్టించారని వాపోయారు. దీనికి వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ బాలయ్య సమాధానం చెబుతూ పదవ తరగతి పాస య్యి, సొంత పొలం వున్న వారినే ఆద ర్శ రైతుగా ఎంపిక చేయాలన్నారు. ఎంపికలో గందరగోళాలను స్క్రీనింగ్ చేసి సరిదిద్దుతామని హామీ ఇచ్చారాయన.

# వేమిరెడ్డి దాతృత్వం వెలకట్ట లేనిది

సొంత లాభం కొంత మానుకొని పరులకు సహాయం చేయడం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వానికి నిదర్శనం. అడిగిన వారికి, అడగని వారికి సహాయం చేసి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకొన్న వ్యక్తి ప్రభాకరయ్య అని బిజెపి జాతీయనేత వెంకయ్యనాయుడు కొనియాడారు. ప్రముఖ కాంట్రాక్టర్, వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్, సాహితీవేత్త విశిష్ట సేవలందించిన వ్యక్తి బెజవాడ గోపాలరెడ్డి. అలాంటి వ్యక్తి పేరుతో అందజేసే అవార్డు మంచి మనసు, దాతృత్వం కలిగిన ప్రభాకరయ్యకు అందజేయడం ఎంతో సముచితమన్నారు. మరింతగా ఆయన సమాజానికి సేవ చేయాలని అభిలషించారు. కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి గొప్పదనాన్ని సేవానిరతిని కొనియాడారు. నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంతో మందికి, ఎన్నో సంస్థలకు గుప్తదానం చేసిన వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మేయర్ భానుశ్రీ మాట్లాడుతూ అరుదైన వ్యక్తిగా ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసించారు. మాకు సమీపంలోనే వుంటున్న ప్రభాకర్‌రెడ్డిలో వున్న దానగుణాన్ని తీసుకోలేకపోయానని మాజీ జిల్లాపరిషత్ ఛైర్మన్ దేగా నారసింహారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభాకర్‌రెడ్డికి బెజవాడ గోపాలరెడ్డి స్మారక అవార్డును అందజేసి ఘన సన్మానం చేశారు.



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు, దేగా నారసింహారెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి స్మారక అవార్డు ప్రదానోత్సవం 9వ తేది టౌన్‌హాలులో ఆత్మీయులు, పురప్రజల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకయ్యనాయుడు ప్రభాకర్‌రెడ్డి గుణగణాలను, సేవాతత్పరతను శ్లాఘించారు. రాజకీయాలలో స్వచ్ఛమైన వ్యక్తిత్వం గలవాడు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అని కీర్తించిన వెంకయ్య ఆయన పాటించిన విలువలను గూర్చి వివరించారు. రాజకీయాలంటే మిషన్ అని, కమీషన్ కాదని రాజకీయాల నుంచి వైదొలగి సాహితీ రంగంలో అవార్డు గ్రహీతైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ దురంధరుడైన బెజవాడ గోపాలరెడ్డి అవార్డు స్వీకరించడంతో తన బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమానికి ముందు ఆదర్శ, గౌరీమానస, కీర్తిలు చేసిన నాట్యం ఆహూతులను ఆకట్టుకొంది. ఈ సన్మాన కార్యక్రమంలో బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటి సభ్యులైన జెవిరెడ్డి, బివి నరసింహంలతోపాటు మురళీకృష్ణ గోపాలయ్య, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవినీతి సహజం!

జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో కొంతమేర అవినీతి జరగడం సహజమేనని దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని సాక్షాత్తు కలెక్టర్ చెప్పడం అందరినీ విస్మయపర్చింది. 9తేది జరిగిన జడ్పీ సమావేశంలో ఈ పథకంలో జరుగుతున్న అవినీతిని వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాద్ సభ దృష్టికి తీసుకవచ్చారు. గ్రామాల్లో ఓటర్ల జాబితా, స్కూల్ పిల్లల రిజిష్టర్లు పెట్టుకొని జాబ్ కార్డులు తయారు చేసేస్తున్నారు. పదేళ్లలోపు చదువుకొనే పిల్లలను కూలీలుగా చూపిస్తున్నారు. పనులు చేయకుండానే నిధులు తినేస్తున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్ రాంగోపాల్ వివరణ ఇస్తూ ఉపాధి హామీ పథకం మనదేశంలో ప్రవేశపెట్టిన పథకాల్లో అత్యుత్తమ పథకం. కరవులో ఆంగ్లేయులు త్రవ్వించిన బకింగ్ హామ్ కాలువను ఈ పథకంతో సరిపోల్చవచ్చు. ఏప్రెల్ 2007 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఈ పథకం క్రింద 187 కోట్ల రూపాయల పనులు జరిగాయి. ప్రస్తుతం 70వేల మంది ఈ పథకంలో భాగంగా పని చేస్తున్నారు. ఈ పథకంలో సూపర్‌వైజర్లు లేరు. ప్రజలే ఆ పని చేయాలి. మేంవెళ్లి పరిశీలించే తీరికలేదు. అటువంటి ఈ పథకంలో కొంతమేర జరిగే అవినీతి గూర్చి ఆందోళన చెందా ల్సిన అవసరమే లేదు. తనకు తెలిసి ఈ పథకంలో ఇప్పటివరకు 73 లక్షల రూపాయలు దుర్వినియోగమ య్యాయని రూఢీ అయ్యిందన్నారు. దీనికి కారకులైన అధికారులపై ఆర్.ఆర్.యాక్ట్ ప్రయోగిస్తున్నాం. ఇంతకు మించి ఇంకేం చేయలేమని కలెక్టర్ చేతులెత్తేయడంతో విస్తుపోవడం సభలోని సభ్యుల వంతయ్యింది.



ఉపాధి హామీలో అవినీతి మామూలంటున్న జిల్లా కలెక్టర్

15వ పేజీ కొరవ

### 2009 కోవూరు నియోజకవర్గ ఓట్ల వివరాలు

| బూత్ నెం | పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | కాంగ్రెస్ | టిడిపి | పిఆర్‌పి |
|---|---|---|---|---|---|
| 199 | వరిణి | 1045 | 342 | 478 | 167 |
| 200 | ఊటుకూరు | 681 | 221 | 360 | 80 |
| 201 | ఊటుకూరు | 656 | 218 | 346 | 69 |
| 202 | ఊటుకూరు | 488 | 129 | 280 | 63 |
| 203 | ఊటుకూరు | 621 | 264 | 243 | 77 |
| 204 | ఊటుకూరు | 977 | 79 | 665 | 201 |
| 205 | ఊటుకూరు | 634 | 259 | 249 | 94 |
| 206 | ఊటుకూరు | 625 | 276 | 252 | 60 |
| 207 | పల్లిపాడు | 884 | 293 | 472 | 89 |
| 208 | పల్లిపాడు | 920 | 313 | 458 | 107 |
| 209 | లేబూరు -1 | 725 | 319 | 337 | 37 |
| 210 | లేబూరు -1 | 750 | 341 | 321 | 42 |
| 211 | లేబూరు -1 | 388 | 239 | 109 | 29 |
| 212 | పున్నూరు | 661 | 375 | 174 | 61 |
| 213 | పున్నూరు | 247 | 104 | 109 | 23 |
| 214 | నిడుమునలి | 910 | 436 | 359 | 64 |
| 215 | ముదివర్తిపాళెం | 565 | 267 | 208 | 65 |
| 216 | కుడితిపాళెం | 604 | 300 | 221 | 57 |
| 217 | కుడితిపాళెం | 873 | 420 | 349 | 58 |
| 218 | కుడితిపాళెం | 812 | 420 | 301 | 37 |
| 219 | రాముడుపాళెం | 893 | 360 | 445 | 41 |
| 220 | గంగపట్నం | 243 | 77 | 116 | 35 |
| 221 | గంగపట్నం | 653 | 239 | 311 | 84 |
| 222 | గంగపట్నం | 673 | 270 | 312 | 69 |
| 223 | గంగపట్నం | 418 | 156 | 141 | 95 |
| 224 | గంగపట్నం | 963 | 224 | 503 | 181 |
| 225 | గంగపట్నం | 643 | 247 | 294 | 81 |
| 226 | మైపాడు | 807 | 373 | 345 | 54 |
| 227 | మైపాడు | 895 | 374 | 414 | 48 |
| 228 | మైపాడు | 799 | 320 | 370 | 93 |
| 229 | మైపాడు | 780 | 314 | 376 | 46 |
| 230 | మైపాడు | 716 | 19 | 689 | 0 |
| 231 | కొరుటూరు | 943 | 399 | 434 | 78 |
| 232 | కొరుటూరు | 942 | 431 | 418 | 62 |
| 233 | సోమరాజుపల్లి | 991 | 542 | 244 | 178 |
| 234 | నరసాపురం | 633 | 162 | 313 | 141 |
| 235 | నరసాపురం | 642 | 178 | 304 | 118 |
| 236 | కొమరిక | 800 | 420 | 251 | 106 |
| 237 | కొమరిక | 766 | 433 | 219 | 93 |
| 238 | రావూరు | 1060 | 514 | 407 | 106 |
| 239 | ఇందుకూరుపేట | 618 | 211 | 310 | 81 |
| 240 | ఇందుకూరుపేట | 641 | 223 | 317 | 77 |
| 241 | ఇందుకూరుపేట | 774 | 322 | 336 | 97 |
| 242 | ఇందుకూరుపేట | 718 | 304 | 310 | 78 |
| 243 | ఇందుకూరుపేట | 593 | 255 | 249 | 64 |
| 244 | ఇందుకూరుపేట | 1022 | 411 | 456 | 113 |
| 245 | ఇందుకూరుపేట | 1091 | 510 | 449 | 87 |
| 246 | ఇందుకూరుపేట | 1012 | 376 | 246 | 151 |
| 247 | పాములవారిపాళెం | 1108 | 513 | 452 | 102 |
| 248 | జగదేవిపేట | 705 | 240 | 364 | 76 |
| 249 | జగదేవిపేట | 759 | 243 | 249 | 68 |
| 250 | జగదేవిపేట | 800 | 380 | 330 | 53 |
| 251 | పాగవారిపాళెం | 908 | 345 | 403 | 124 |
| 252 | పి.వి కండ్రిగ | 445 | 198 | 206 | 19 |
| మొత్తం | | 1,69,009 | 65,768 | 73,212 | 22,624 |

## జనవాణి

2వ పేజీ కొరవ

పడుతున్నారు. వెళ్లిన భక్తులకు టిటిడి వసతి కల్పించలేకపోతోంది. శ్రీవారి సర్వ దర్శనానికి ఏ రోజు ఎన్ని గంటలు పడుతుందో చెప్పలేని పరిస్థితి. లఘు దర్శనం మూలంగా వెంకటేశ్వరస్వామిని చూశామన్న తృప్తి మిగలడం లేదు. క్యూలో మహిళల పట్ల స్కౌట్లు వ్యవహరిస్తున్న తీరు అనుచితంగా వుంటున్నది. టిటిడి ఇఓ ఈ వ్యవహారాన్ని నిశితంగా పరిశీలించమనవి.

సిహెచ్.సురేష్‌బాబు, నెల్లూరు

### ఉద్యోగసంఘాలు చేస్తున్నదేమిటి?

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతన సవరణకు కమిషన్‌ను నియమించి నివేదిక సమర్పణకు ఒక సంవత్సరం గడువును నిర్ణయించింది. కానీ సంవత్సర కాలం పూర్తి కావస్తున్నా నివేదిక సమర్పణకు చర్యలు తీసుకోకపోగా వేతన సవరణ సంఘ కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగించడం అన్యాయం. ఈ విషయంలో వుద్యోగ సంఘాలు గమ్మునుండడం బాధాకరం.

ఎ.సుధాకర్‌రావు, విద్యానగర్

## ఇసుక దొంగలు

మొదటి పేజీ కొరవ

ఇద్దరూ ఇంట్లో ముఖం దాచుకొన్నారు. రామనారాయణరెడ్డి ఆ రోజు అసలు నెల్లూరుకే రాలేదు. వివేకానందరెడ్డి నెల్లూరు నగరంలో వుండికూడా ఇంట్లో నుంచి బయటకు రావడానికి సిగ్గుపడి పోయాడు. చాలా అసహ్యమైన పరిస్థితి. గత పది పదిహేనేళ్లుగా జిప వంటి ముఖ్యమైన సమావేశాలకు వీరిద్దరూ గైర్హాజరైన సాదృశ్యమే లేదు. ఎప్పుడు ఏ సమావేశం జరిగినా పెద్ద గొంతుతో అందరి మీదా విరుచుకపడడం వారికొక సరదా. కానీ ఇప్పుడు తామే దొంగలుగా జనం మధ్యలో నిలబడే పరిస్థితి వచ్చేసరికి బిక్కచచ్చి పోయారు. ముఖం చూపించలేని దీనస్థితిలో గైర్హాజరే మేలనుకొన్నారు.

సమావేశంలో ఇసుక దోపిడీ మీద రెండు గంటలకు పైగా చర్చ జరిగింది. తెలుగుదేశం జడ్పీటిసి సభ్యుడు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అధికారులను నిలదీశాడు. అయితే వేదిక మీద వున్న జిప ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఇరువురూ నిలువు దోపిడీ జరిగింది నిజమే అని ఒప్పుకోవడంతో రచ్చ లేకుండాపోయింది. మూడు నెలలపాటు యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేశారని, దానిపై జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీ వేస్తున్నామని, ఇక ముందు ఈ దోపిడీ జరగకుండా నిలుపుతామని ప్రకటించాడు కలెక్టర్.

మొత్తానికి సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితిలో వద్దారు ఆనం సోదరులిద్దరూ. దీని నుంచి ఎట్లా బయటపడాలో వారికి అర్థం కావడం లేదు. రేపటి నుంచి తమలో ఎవరు నోరెత్తి ఎవరి గురించి మాట్లాడినా, ఇసుక దొంగలు మీరేంటి మాట్లాడేదని ఎగతాళి చేయడం ఖాయం. ముందున్న బ్రతుకంతా ఇసుక దొంగలుగా జనంలో అవమానాలు ఎదుర్కొంటూ బ్రతకాలి. రాజకీయవాదులకు అంత కంటే పెద్ద శిక్ష వేరొకటి వుంటుందని భావించలేము.



## 2009 కోవూరు నియోజకవర్గ ఓట్ల వివరాలు

| బూత్ నెం | పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | కాంగ్రెస్ | టిడిపి | పిఆర్‌పి |
|---|---|---|---|---|---|
| 1 | రెడ్డిపాళెం | 634 | 355 | 236 | 18 |
| 2 | వవ్వేరు | 609 | 355 | 204 | 31 |
| 3 | వవ్వేరు | 1022 | 386 | 449 | 140 |
| 4 | వవ్వేరు | 917 | 332 | 421 | 119 |
| 5 | వవ్వేరు | 896 | 390 | 357 | 106 |
| 6 | వవ్వేరు | 448 | 244 | 175 | 13 |
| 7 | వవ్వేరు | 659 | 305 | 160 | 161 |
| 8 | పోలినాయుడుచెరువు | 524 | 220 | 249 | 26 |
| 9 | బుచ్చిరెడ్డిపాళెం | 583 | 206 | 255 | 108 |
| 10 | బుచ్చిరెడ్డిపాళెం | 624 | 219 | 246 | 122 |
| 11 | బుచ్చిరెడ్డిపాళెం | 764 | 343 | 277 | 116 |
| 12 | బుచ్చిరెడ్డిపాళెం | 900 | 420 | 285 | 132 |
| 13 | బుచ్చిరెడ్డిపాళెం | 776 | 362 | 352 | 42 |
| 14 | బుచ్చిరెడ్డిపాళెం | 823 | 405 | 331 | 59 |
| 15 | ఎం.పి.డి.ఓ ఆఫీస్ | 557 | 230 | 247 | 67 |
| 16 | పంచాయితీఆఫీస్ | 866 | 305 | 396 | 66 |
| 17 | ప్రాథమిక పాఠశాల | 480 | 179 | 210 | 74 |
| 18 | హౌస్‌తోట | 459 | 184 | 170 | 61 |
| 19 | పంచాయితీ ఆఫీస్ | 541 | 176 | 236 | 107 |
| 20 | శ్రీరామనగర్ | 355 | 114 | 155 | 58 |
| 21 | ఎ.ఎస్.ఎం లైబ్రరీ | 759 | 292 | 335 | 112 |
| 22 | పంచాయితీరాజ్ ఆఫీస్ | 835 | 318 | 329 | 119 |
| 23 | జూనియర్ కాలేజ్ | 599 | 243 | 262 | 77 |
| 24 | జూనియర్ కాలేజ్ | 640 | 245 | 248 | 111 |
| 25 | జూనియర్ కాలేజ్ | 408 | 180 | 162 | 55 |
| 26 | జూనియర్ కాలేజ్ | 487 | 174 | 232 | 71 |
| 27 | పూలతోట | 445 | 190 | 148 | 72 |
| 28 | పూలతోట | 460 | 182 | 194 | 64 |
| 29 | ఇస్కపాళెం | 614 | 235 | 269 | 96 |
| 30 | ఇస్కపాళెం | 621 | 214 | 282 | 91 |
| 31 | బాలకృష్ణ గిరిజనకాలనీ | 473 | 217 | 128 | 104 |
| 32 | బాలకృష్ణ గిరిజనకాలనీ | 560 | 284 | 127 | 112 |
| 33 | ఇస్కపాళెం | 1042 | 399 | 464 | 125 |
| 34 | ఇస్కపాళెం | 1029 | 449 | 401 | 123 |
| 35 | రేబాల | 614 | 236 | 266 | 99 |
| 36 | రేబాల | 496 | 247 | 196 | 35 |
| 37 | రేబాల | 640 | 250 | 263 | 106 |
| 38 | రేబాల | 839 | 316 | 352 | 139 |
| 39 | రేబాల | 703 | 317 | 303 | 49 |
| 40 | నాగాయగుంట | 668 | 268 | 336 | 51 |
| 41 | నాగమాంబపురం | 611 | 253 | 246 | 97 |
| 42 | నాగమాంబపురం | 646 | 276 | 242 | 88 |
| 43 | పంచేడు | 1189 | 407 | 728 | 30 |
| 44 | క్రొత్తమినగల్లు | 555 | 190 | 313 | 28 |
| 45 | మినగల్లు | 613 | 213 | 349 | 29 |
| 46 | మినగల్లు | 922 | 352 | 484 | 50 |
| 47 | జొన్నవాడ | 643 | 215 | 343 | 58 |
| 48 | జొన్నవాడ | 665 | 238 | 329 | 59 |
| 49 | పెనుబల్లి | 674 | 223 | 224 | 180 |
| 50 | పెనుబల్లి | 738 | 286 | 205 | 197 |
| 51 | పెనుబల్లి | 478 | 204 | 247 | 13 |
| 52 | చల్లాయపాళెం | 692 | 126 | 443 | 93 |
| 53 | చల్లాయపాళెం | 763 | 486 | 233 | 21 |
| 54 | కాళయకాగొల్లు | 756 | 307 | 325 | 104 |
| 55 | కాళయకాగొల్లు | 854 | 325 | 362 | 92 |
| 56 | దామరమడుగు | 733 | 336 | 255 | 126 |
| 57 | దామరమడుగు | 733 | 326 | 221 | 149 |
| 58 | దామరమడుగు | 624 | 278 | 200 | 120 |
| 59 | దామరమడుగు | 875 | 199 | 319 | 323 |
| 60 | దామరమడుగు | 573 | 274 | 167 | 97 |
| 61 | దామరమడుగు | 346 | 127 | 199 | 12 |
| 62 | పాటూరు | 701 | 200 | 318 | 168 |
| 63 | పాటూరు | 715 | 191 | 310 | 165 |
| 64 | పాటూరు | 542 | 218 | 228 | 75 |
| 65 | పాటూరు | 602 | 237 | 247 | 62 |
| 66 | గంగవరం | 570 | 218 | 268 | 75 |
| 67 | గంగవరం | 609 | 257 | 287 | 49 |
| 68 | పోతిరెడ్డిపాళెం | 717 | 315 | 342 | 47 |
| 69 | పోతిరెడ్డిపాళెం | 729 | 337 | 321 | 43 |
| 70 | పోతిరెడ్డిపాళెం | 721 | 278 | 348 | 77 |
| 71 | పోతిరెడ్డిపాళెం | 596 | 244 | 242 | 84 |
| 72 | పడుగుపాడు | 564 | 231 | 184 | 130 |
| 73 | పడుగుపాడు | 614 | 252 | 183 | 140 |
| 74 | పడుగుపాడు | 609 | 248 | 197 | 128 |
| 75 | పడుగుపాడు | 625 | 239 | 197 | 148 |
| 76 | పడుగుపాడు | 628 | 226 | 204 | 176 |
| 77 | పడుగుపాడు | 681 | 198 | 220 | 228 |
| 78 | పడుగుపాడు | 810 | 315 | 338 | 135 |
| 79 | పడుగుపాడు | 793 | 346 | 266 | 138 |
| 80 | పడుగుపాడు | 731 | 240 | 165 | 299 |
| 81 | ఇనమడుగు | 682 | 255 | 271 | 134 |
| 82 | ఇనమడుగు | 627 | 246 | 214 | 136 |
| 83 | ఇనమడుగు | 495 | 216 | 166 | 103 |
| 84 | ఇనమడుగు | 531 | 215 | 156 | 132 |
| 85 | ఇనమడుగు | 657 | 266 | 195 | 161 |
| 86 | ఇనమడుగు | 387 | 165 | 130 | 72 |
| 87 | ఇనమడుగు | 669 | 281 | 256 | 103 |
| 88 | లేగుంటపాడు | 646 | 281 | 288 | 59 |
| 89 | లేగుంటపాడు | 653 | 280 | 291 | 58 |
| 90 | లేగుంటపాడు | 392 | 264 | 74 | 49 |
| 91 | కోవూరు | 804 | 295 | 239 | 228 |
| 92 | కోవూరు | 707 | 312 | 258 | 113 |
| 93 | కోవూరు | 781 | 374 | 239 | 129 |
| 94 | కోవూరు | 629 | 240 | 226 | 135 |
| 95 | కోవూరు | 711 | 223 | 274 | 171 |
| 96 | కోవూరు | 668 | 233 | 252 | 160 |
| 97 | కోవూరు | 782 | 255 | 307 | 176 |
| 98 | కోవూరు | 799 | 141 | 456 | 148 |
| 99 | కోవూరు | 699 | 318 | 183 | 164 |
| 100 | కోవూరు | 434 | 150 | 151 | 106 |
| 101 | కోవూరు | 451 | 119 | 208 | 114 |
| 102 | కోవూరు | 546 | 112 | 292 | 114 |
| 103 | కోవూరు | 530 | 158 | 204 | 148 |
| 104 | కోవూరు | 420 | 172 | 137 | 88 |
| 105 | కోవూరు | 842 | 428 | 210 | 172 |
| 106 | కోవూరు | 420 | 157 | 161 | 86 |
| 107 | కోవూరు | 444 | 183 | 136 | 109 |
| 108 | కోవూరు | 568 | 278 | 184 | 79 |
| 109 | కోవూరు | 523 | 238 | 176 | 77 |
| 110 | కోవూరు | 678 | 333 | 246 | 66 |
| 111 | కోవూరు | 686 | 357 | 210 | 71 |
| 112 | కోవూరు | 500 | 159 | 234 | 78 |
| 113 | కోవూరు | 778 | 173 | 367 | 209 |
| 114 | కోవూరు | 863 | 193 | 463 | 172 |
| 115 | చెర్లోపాళెం | 408 | 189 | 169 | 32 |
| 116 | చెర్లోపాళెం | 545 | 230 | 210 | 85 |
| 117 | సీతారామపురం | 659 | 169 | 329 | 135 |
| 118 | సీతారామపురం | 682 | 195 | 334 | 121 |
| 119 | వేగూరు | 750 | 310 | 300 | 106 |
| 120 | వేగూరు | 757 | 335 | 258 | 103 |
| 121 | మోదేగుంట | 677 | 307 | 313 | 33 |
| 122 | కొత్తవంగల్లు | 957 | 374 | 326 | 218 |
| 123 | పాతవంగల్లు | 318 | 147 | 140 | 25 |
| 124 | కొత్తవంగల్లు | 304 | 132 | 140 | 22 |
| 125 | కొత్తవంగల్లు | 343 | 106 | 144 | 75 |
| 126 | కొత్తవంగల్లు | 451 | 238 | 131 | 59 |
| 127 | రామాపురం | 807 | 411 | 224 | 119 |
| 128 | మిక్కిలిం పేట | 431 | 189 | 178 | 48 |
| 129 | యల్లాయపాళెం | 524 | 254 | 195 | 51 |
| 130 | యల్లాయపాళెం | 515 | 198 | 224 | 75 |
| 131 | యల్లాయపాళెం | 468 | 164 | 215 | 62 |
| 132 | సంగాయపాళెం | 352 | 128 | 167 | 38 |
| 133 | యల్లాయపాళెం | 927 | 331 | 434 | 130 |
| 134 | యల్లాయపాళెం | 593 | 153 | 272 | 130 |
| 135 | ఆలూరుపాడు | 504 | 211 | 230 | 31 |
| 136 | రెడ్డిపాళెం | 424 | 154 | 218 | 23 |
| 137 | మానేగుంటపాడు | 412 | 142 | 206 | 42 |
| 138 | రామన్నపాళెం | 1014 | 374 | 477 | 125 |
| 139 | నార్త్‌రాజుపాళెం | 762 | 234 | 433 | 64 |
| 140 | నార్త్‌రాజుపాళెం | 757 | 224 | 433 | 62 |
| 141 | నార్త్‌రాజుపాళెం | 617 | 229 | 276 | 81 |
| 142 | నార్త్‌రాజుపాళెం | 924 | 426 | 410 | 51 |
| 143 | గండవరం | 725 | 303 | 318 | 79 |
| 144 | గండవరం | 756 | 341 | 289 | 101 |
| 145 | గండవరం | 386 | 147 | 163 | 65 |
| 146 | తాటాకుల దిన్నె | 745 | 267 | 383 | 60 |
| 147 | పెయ్యలపాళెం | 552 | 182 | 319 | 81 |
| 148 | బొడ్డువారిపాళెం | 437 | 137 | 221 | 61 |
| 149 | బొడ్డువారిపాళెం | 525 | 221 | 253 | 36 |
| 150 | కమ్మపాళెం | 692 | 89 | 579 | 11 |
| 151 | సి.ఎస్.పురం | 733 | 198 | 364 | 135 |
| 152 | రాచర్లపాడు | 465 | 208 | 201 | 37 |
| 153 | రేగడిచెలిక | 827 | 298 | 463 | 37 |
| 154 | తలమంచి | 848 | 236 | 471 | 84 |
| 155 | తలమంచి | 586 | 190 | 277 | 100 |
| 156 | తలమంచి | 677 | 262 | 308 | 87 |
| 157 | నాయుడుపాళెం | 701 | 245 | 325 | 109 |
| 158 | గుండాలమ్మపాళెం | 832 | 281 | 415 | 94 |
| 159 | కొడవలూరు | 540 | 195 | 270 | 57 |
| 160 | కొడవలూరు | 588 | 234 | 272 | 64 |
| 161 | కొడవలూరు | 385 | 110 | 224 | 38 |
| 162 | కొడవలూరు | 436 | 132 | 230 | 39 |
| 163 | బసవాయపాళెం | 291 | 119 | 156 | 8 |
| 164 | వెంకన్నపురం | 373 | 156 | 180 | 24 |
| 165 | దామేగుంట | 893 | 350 | 351 | 164 |
| 166 | పార్లపల్లి | 758 | 222 | 392 | 120 |
| 167 | పార్లపల్లి | 829 | 247 | 383 | 131 |
| 168 | చౌకచర్ల | 622 | 276 | 247 | 69 |
| 169 | చౌకచర్ల | 645 | 288 | 235 | 82 |
| 170 | దంపూరు | 357 | 69 | 229 | 46 |
| 171 | దంపూరు | 546 | 205 | 297 | 24 |
| 172 | దంపూరు | 597 | 244 | 303 | 18 |
| 173 | దంపూరు | 296 | 114 | 152 | 7 |
| 174 | వావిళ్ల | 1049 | 389 | 586 | 50 |
| 175 | వావిళ్ల | 504 | 201 | 192 | 72 |
| 176 | విడవలూరు | 695 | 240 | 357 | 77 |
| 177 | విడవలూరు | 755 | 236 | 427 | 73 |
| 178 | విడవలూరు | 721 | 150 | 395 | 127 |
| 179 | విడవలూరు | 872 | 533 | 253 | 70 |
| 180 | విడవలూరు | 620 | 123 | 395 | 78 |
| 181 | విడవలూరు | 570 | 189 | 326 | 35 |
| 182 | విడవలూరు | 422 | 140 | 241 | 29 |
| 183 | ముదివర్తి | 632 | 282 | 286 | 41 |
| 184 | ముదివర్తి | 658 | 339 | 249 | 28 |
| 185 | ముదివర్తి | 566 | 286 | 192 | 60 |
| 186 | ముదివర్తి | 907 | 571 | 252 | 47 |
| 187 | ముదివర్తి | 708 | 256 | 391 | 34 |
| 188 | ముదివర్తి | 767 | 274 | 401 | 33 |
| 189 | అలగానిపాడు | 574 | 187 | 314 | 51 |
| 190 | అలగానిపాడు | 572 | 203 | 315 | 31 |
| 191 | గాదెలదిన్నె | 862 | 306 | 330 | 185 |
| 192 | వరిణి | 1011 | 443 | 321 | 202 |
| 193 | వరిణి | 438 | 76 | 259 | 85 |
| 194 | పొన్నపూడి | 872 | 352 | 393 | 88 |
| 195 | వరిణి | 671 | 201 | 293 | 146 |
| 196 | వరిణి | 666 | 189 | 302 | 122 |
| 197 | రామతీర్థం | 548 | 156 | 196 | 169 |
| 198 | రామతీర్థం | 873 | 277 | 369 | 182 |

కొరవ 14వ పేజీ

# నిజాయితీకి వేధింపుల సత్కారం

రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో నిజాయితీగా పనిచేసే అధికారులకు ఎటువంటి సత్కారం లభిస్తుందో మాజీ డిజిపి ఎకెమహంతిని చూస్తే అర్థమైపోతుంది. శాసనసభ ఎన్నికల సమయంలో అప్పటి డిజిపి ఎస్‌ఎస్‌పియాదవ్ కాంగ్రెస్ పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని రుజువు కావడంతో, ఎన్నికల కమిషన్ ఎకెమహంతిని ఆ స్థానంలో నియమించింది. నిజాయితీకి, నిర్భీతికి నమూనాగా పేరు తెచ్చుకొన్న మహంతి



ఎన్నికలలో చాలా నిష్పక్షపాతంగా వ్యవహరించాడు. అది వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి కష్టం కల్గించింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన్ను ఆ పదవి నుంచి తొలగించి, మళ్లీ యాదవ్‌ను తెచ్చుకొన్నారు. అప్పటి నుంచి మహంతి మీద వేధింపులు మొదలయ్యాయి. ఆయన్ను ఏ పనీలేని చోటుకు బదలీ చేశారు. డిజిపి హోదాకు తగిన పని, సిబ్బంది లేకుండా అవమానించారు. అది చాలాదన్నట్లు ఇప్పుడు ఆయనకు ఒక చార్జ్ మెమో కూడా జారీ చేసింది ప్రభుత్వం. అందులో పేర్కొన్న నేరం, గతంలో ఎప్పుడో ఒకసారి ఆయన ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా ఢిల్లీ వెళ్లి వచ్చాడట. డిజిపి స్థాయి కల్గిన వ్యక్తి ఢిల్లీ వెళ్లడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోకపోవడం ఎంత పెద్ద నేరమో పసి పిల్లవాడిని అడిగినా చెప్తాడు.

పోలీసుశాఖలో సంచలనాలకు కేంద్ర బిందువు మరొక అధికారి మహేష్‌చంద్ర లడ్డా సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. నల్లమల అడవుల నుంచి నక్సలైట్లను ఏరి పారేయడంలో లడ్డా, బాలసుబ్రహ్మణ్యం వంటి అధికారులు చూపిన సాహసాన్ని పోలీసుశాఖలో కథలు కథలుగా చెప్పుకొంటూరు. మావోయిస్టులు ఆయన్ను తమ హిట్ లిస్ట్‌లో చేర్చి వున్నారు. ఒంగోలులో ఒకసారి దాడి కూడా జరిగింది. అదృష్టం బాగుండి తృటిలో ప్రాణాపాయం తప్పింది.

ఎన్నికల సమయంలో ఆయన గుంటూరు ఎస్పీగా పనిచేశాడు. ప్రచారం కోసం గుంటూరు జిల్లాకు వచ్చిన వైఎస్ జగన్ మీద ఒక ఎన్నికల కేసు దాఖలు చేశాడు. అది మనసులో పెట్టుకొన్న ముఖ్యమంత్రి, లడ్డాను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడిప్పుడు. గుంటూరు టౌన్‌లో ఒక సివిల్ కేసులో జోక్యం చేసుకొన్నాడనే నేరం మీద ఆయనపై క్రిమినల్ కేసు పెట్టింది ప్రభుత్వం. నక్సలైట్ల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పెట్టిన ఖర్చు వివరాలను సేకరించడానికి ఒక స్పెషల్ ఆడిట్ పార్టీని నియమించారు. ఏదో తప్పు కనిపెట్టి ఆయన్ను సస్పెండ్ చేయాలన్నది ప్రభుత్వ ప్రయత్నం. రాష్ట్రం కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టి పని చేసిన లడ్డా వంటి అధికారులను ప్రభుత్వం ఇట్లా వెంటబడి వేటాడి వేధింపులకు గురి చేస్తే, ఇక ఈ రాష్ట్రంలో ఏ అధికారి నిజాయితీగా పని చేయగలడు?



చింతారెడ్డిపాలెంలో ప్లాటినమ్ ప్రాజెక్ట్ కొత్త వెంచర్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ, సినీతారలు మధుశాలిని, నవనీత్‌కౌర్‌లతో వెంచర్ నిర్మాత చంద్రశేఖర్‌రెడ్డి.

# చిరంజీవి దారి ఏది?

ప్రజారాజ్యం అధినేత చిరంజీవి తన రాజకీయం తీరెట్లా వుండాలో తేల్చుకోలేని అయోమయంలో పడి విలవిల లాడుతున్నాడు. శాసనసభలో ఈ పరిస్థితి తేటతెల్లంగా కన్పడుతున్నది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంతో కలిసి పని చేయడానికి ఆయన ఇష్టపడడం లేదు. దానితో చాలా సందర్భాలలో ఆయన ప్రసంగం తీరు కాంగ్రెస్‌తో కుమ్మక్కైన అభిప్రాయాన్ని కల్గిస్తున్నది. కాంగ్రెస్‌తో కలిసి పోయారన్న ప్రచారం జరిగితే, అసలు పార్టీ ఉనికికే ముప్పు వస్తుందన్నది భయం. అట్లని తెలుగుదేశంతో గొంతు కలిపితే తమను తోక పార్టీగా జమ కడతారని సందేహం. రెండింటి మధ్యలో ఎటు పోవాలో తేల్చుకోలేక సతమతమైపోతున్నాడు చిరంజీవి. మరొకప్రక్క ప్రజారాజ్యం ఎమ్మెల్యేలందరూ ముఖ్యమంత్రితో లోపాయికారీ సంబంధాలు పెట్టుకోవడం ఆ పార్టీని కలత పెడుతున్నది. భవిష్యత్తులో ముఖ్యమంత్రి ఇబ్బందులలో పడే పరిస్థితి వస్తే, తన పార్టీ ఎమ్మెల్యేలు తన మాట లెక్కచేయకుండా కాంగ్రెస్‌లో చేరిపోతారన్న నిజం చిరంజీవికి తెలుసు. ఇప్పటికే ఎన్నికలలో ఓడిపోయిన ప్రముఖులంతా పార్టీని వదలిపెట్టి వెళ్లిపోతున్నారు. కొన్ని జిల్లాలలో అసలు పార్టీ ఉనికి అదృశ్యమైపోయింది. చెప్పుకోవడానికి ఒక్క మనిషి కూడా లేని దుస్థితి. కొత్తగా పార్టీలోకి వచ్చి చేరేవారు అసలే లేరు. దానితో ప్రజారాజ్యం భవిష్యత్తు ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమౌతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి నిలబెట్టడానికి అభ్యర్థులైనా దొరుకుతారా అన్నది సందేహం. ఎంతమాత్రం భవిష్యత్తు కనిపించని రాజకీయాన్ని తాను ఎంత వరకు అంటిపెట్టుకొని వుండాలో చిరంజీవికి తెలియని పరిస్థితి. దానితో తన దారి ఎటో తేల్చుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ఒక్కొక్కరోజు ఒక్కొక్క రకంగా వ్యవహారం నడుపుతున్నాడు. ఎవరు ముందు వచ్చి తన సహకారం కోరితే ఆ అంశం మీద వారికి మద్దతు తెల్పుతున్నాడు.

# దోపిడీ జరిగిన తీరు ఇదీ!

ఆనం సోదరులను దొంగలుగా జనం ముందు నిలబెట్టిన ఇసుక దోపిడీ చాలా పకడ్బందీగా, ఒక పథకం ప్రకారం జరిగింది. జిల్లాలో మొత్తం మీద 28 ఇసుక రేవులు గుర్తించారు. వీటిలో ఇసుక త్రవ్వుకోవడానికి సంవత్సరానికికొకసారి వేలం పాట జరుగుతుంది. వేలం పాడినవారు వేలం సొమ్ముకు అదనంగా, లారీకి ఇంతని రాయల్టీ కూడా చెల్లించాలి.

ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ ఇసుక వ్యాపారులందరినీ కలిపి ఒక సిండికేటు ఏర్పాటు చేశాడు. జిల్లాలోని అన్ని రేవులకూ వీరు వేలం పాడారు. సాధారణ రేటు కంటే, పది పన్నెండు రెట్లు అదనంగా పాట పెంచారు. వేలం పాడినవారు, వేలం సొమ్ము మొత్తం ప్రభుత్వానికి కట్టి, ఇసుక త్రవ్వకం మొదలు పెట్టాలి. కానీ జిల్లామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే వివేకానందరెడ్డిలతో ఈ సిండికేట్ సభ్యులకు కుదిరిన అవగాహన ప్రకారం, అధికారులు ఒక హైకోర్టు కేసు సాకుగా చూపించి, వేలం పాటలను ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. కానీ ఇసుక త్రవ్వకానికి మాత్రం అనుమతించారు. పొట్టేపాళెం, పోతిరెడ్డిపాళెం, విరువూరు, సంగం, ములుమూడి వంటి ఎనిమిది రేవులలో వీరు ఇష్టం వచ్చినట్లు ఇసుక త్రవ్వి పారేశారు. వేలం సొమ్ము కట్టలేదు. రాయల్టీ కట్టేపనిలేదు. దానితో అంతా లాభమే.

## కార్టూన్ స్కేప్



పార్టీని బలోపేతం చేస్తామంటే ప్రజల సమస్యలపై పోరాడుతారనుకున్నా.. ఇలా సినిమాలతో అనుకోలేదు...!!






Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.